
పెద్దకథ

# రెండు నదుల మధ్య




- ముళ్ళపూడి సుబ్బారావు

# రెండు నదుల మధ్య



ఇంకా చీకట్లు పూర్తిగా తొలిగిపోలేదు. సముద్రంలో ఏర్పడ్డ వాయుగుండం వల్ల వాతావరణం భీతావహంగా వుంది. పైన మబ్బులు వేగంగా తిరుగుతున్నాయి. అంతక్రితమే బట్టతడుపు జల్లు పడినట్టుంది. నేలంతా కళ్లాపి చల్లినట్లుంది.

మా ఇంటికీ, మా ముగ్గురి బాబాయిల ఇళ్లకు మధ్య వున్న వీధిలాంటి దారిలో మా రెండో బాబాయి అసహనంగా అటూ ఇటూ తిరుగుతున్నాడు. నారాక చూసి కొద్దిగా ముందుకు వచ్చి అడిగాడు.

“తూముకాడ (రచ్చబండ) జనాలేమైనా పోగడ్డారా?” అని ఆ పలకరింపు అనుకోకుండా వచ్చినవాన్ని పలకరించినట్లు లేదు. ఆయన ఏదో హడావిడిలో వున్నట్లున్నాడు. ఊరి వాతావరణమే నాకు సాధారణ స్థితికి కొద్దిగా భిన్నంగా తోచింది. అంత ఉదయమే నాలుగైదు ‘టూ వీలర్స్’ వేగంగా వెలుతూ నాకు ఎదురుపడ్డాయి. దారిలో పలకరించిన వాళ్ల మొహాల్లో మొత్తం మీద ఏదో అలజడి! ఊరే మారిపోయిందా? లేక తనే చాలా రోజులు దూరంగా ఉండడం వలన అట్లా అనిపిస్తున్నదా?

“ముగ్గురు నలుగురు కనిపించారు. పక్కన జయమ్మ హోటల్లో మామూలుగానే జనం వున్నారు” జవాబుగా బాబాయితో అని మా ఇంటి వాకిట్లోకి నడిచాను.

“నాలుగింటికే మెలకువ వచ్చింది. అప్పట్నుంచీ చూస్తున్నాను. సరళా పిల్లాడూ రాలేదా?”పాలగిన్నెతో గేదె చావిట్లోంచి వస్తూ అమ్మ అడిగింది.

“లేదే! రెండ్రోజులే లీవు పెట్టా” అని “ఫిల్టర్ కాఫీ పెట్టవే, మంచి పాలతో తాగి చాలా రోజులైంది” అన్నాను సూట్‌కేసు ఇంట్లో పడేస్తూ.

ఇంటి దగ్గర బాత్‌రూమ్‌లో స్నానం చేయడం నచ్చదు నాకు. కొబ్బరిచెట్లు మొదట్లో స్నానం పూర్తి చేసాను. ఆలోగానే ‘టిపటాప్’ సామాన్లతో షామియానాలతో ఓ ట్రాక్టరు గోదావరగా వీధిలోంచి బురబురలాడుతూ వెళ్లింది.

మాది తూర్పు వాకిలి ఇల్లు. మా ఇంటి వెనుకనున్న తర్వాత వీధిలో ఉమ్మడిగా వున్నప్పటి మా పాత యింటి స్థలం వుంది. నలభై ఏళ్ల క్రితం ఊరువదలి వెళ్ళిన మా పెదనాన్న ఏడెనిమిదేళ్ళ క్రితం మా ఊరు తిరిగివచ్చి ఆయన వాటాగా వచ్చిన ఆ పాతింటి స్థలంలో ఇల్లు కట్టుకొన్నాడు. సామాను ట్రాక్టరు వెనుక వీధి మొదట్లో నిలబడ్డట్టుగా చప్పుళ్ళు అవుతున్నాయి. సామాన్లు దించుతున్నట్టుగా శబ్దాలు, మనుషుల అలికిడి.

“ఏంటమ్మా అది?” అమ్మనడిగాను.

“ఇవాళ మీ పెద్దమ్మ దినంరా. పదిరోజుల క్రితం పోయింది. నీకు తెలీదా?” ఆశ్చర్యంగా అని రెండు సెకన్లాగి ‘నీకు కార్డు వేయ లేదా?’ అడిగింది అమ్మ.

ఓ వారంక్రితం నా స్నేహితుడు సీతారావుడు ఫోన్ చేశాడు. మాటలో మాటగా పెద్దమ్మ చావు గురించి చెప్పాడు. మా పెదనాన్న పెద్ద కొడుకు శ్రీమన్నారాయణ నాకు చెప్పమని చెప్పాడట! కార్డు వస్తుంది కదా అనుకొన్నాను. తరువాత పని ఒత్తిడివల్ల ఆ విషయం పట్టించుకోలేదు. నిన్న పొద్దుట గుర్తుకొచ్చి సాయంత్రం బయలుదేరి వచ్చాను.

“కార్డు రాలేదు గానీ ఫోన్లో సీతారావుడు చెప్పాడు. ఇక్కడి కొచ్చి కూడా రెండెళ్లు దాటింది గదాని వచ్చాను” అమ్మకి సమాధానం చెప్పాను.

“అనుకొన్నాన్లే! వాళ్ళకి మనుషులు గుర్తుంటారా? మీ నాన్నతో అవసరాలన్నీ తీర్చుకొని... ఇప్పుడు మీరెందుకు గుర్తు కొస్తారు?” ఇంకా ఏదో అనబోతున్న అమ్మను ఆపి అడిగాను.

“ఎలా పోయిందే పెద్దమ్మ?”

“అంతా దేవుడికే తెలియాలి. ఆఖరోడి పెళ్ళి గురించి ఇంట్లో ఏదో గొడవలవుతున్నాయట! మొదట రెండుసార్లు మైలవచ్చి పెళ్ళి వాయిదా పడింది. ఇప్పుడేవో యిలా .... కొందరేమో యింట్లో మాట నెగ్గక మందు మింగిందంటున్నారు. వాళ్ళ పెరుగుదల చూసి ఎవరో చేతబడి చేయించారని కొందరంటున్నారు .... నిన్న నువ్వు వస్తున్నావని ఫోన్ చేస్తే అందుకే వస్తున్నావనుకొన్నాను.” అంది అమ్మ.

అప్పటి వరకూ అందరి చేతా విజేతగా చెప్పబడ్డ పెద్దమ్మ మరణం ఆసక్తి కరంగానే మారింది.

“సరే! ఎలాగూ వచ్చావు కదా! వెళ్లివస్తావా వాళ్లింటికి” అంది అమ్మ. ఆమె గొంతులో వెళ్లడం పట్ల ఇష్టమూ, అయిష్టమూ రెండు ధ్వనించాయి.

మా ఇంటికీ ఆ ఇంటికీ ఉన్న సంబంధం అట్లాంటిది మరి!

అంతలోకే పంపులు రావటం మొదలైంది. నీల్లు తొట్టెలోకి వదిలి, మరో పంపునీరు మొక్కలకు వదిలింది అమ్మ! రేడియోలో పాశర్లపూడి బ్లో అవుట్ గురించి ప్రాంతీయ వార్తల్లో చెబుతున్నారు. అమ్మతోపాటు పెరట్లో కలియతిరుగుతూ అడిగాను.

“అవునూ బాబాయేంటి రచ్చబండ అంటున్నాడు?” అప్పటి కింకా మబ్బులు విడిపోలేదు. వాతావరణం గ్లూమీగా వుంది. సన్నగా చినుకులు పడుతున్నాయి.

అమ్మ మొహం కొద్దిగా విసుగ్గా పెట్టింది. “ఎప్పుడూ వుండే గోలే! గొడవలేకుండా ఏ రోజూ తెల్లారట్లేదు. నెలరోజుల్నాడు రాయుడి కొబ్బరి తోటలో మాలపల్లివాళ్లు కాయలు కోసారని కేసు పెట్టారంట. ఆ కాయలు భూతనఖ్యాంకు మెంబరు తాడిగడప మునెయ్య ట్రాక్టరులో జంగారెడ్డి గూడెం తోలారంట. మాలపల్లిలో వాడి కొక్కడికే ట్రాక్టరుందంట! అదేం కాదు అసెంబ్లీ ఎలక్షన్లో ఊళ్లోవాళ్లకి వ్యతిరేకంగా పనిచేసావని యిలాంటి కేసుల్లో యిరికిస్తున్నారని వాళ్లంటారు.

ఇరవై రోజుల్నాడు సినిమా హాల్లో పాలపర్తి సోమయ్య కూతుర్ని గొండ్లగూడెం కుర్రాళ్ళెవరో ఏడిపించారట. నాల్రోజుల క్రితం బ్రోకరు గంగరాజు కూతురు - అది కాలేజీలో ఇంటర్ చదువుతుందిలే - బోడగడ్ల సూరయ్య లేడూ - పంచాయితీ బోర్డులో మాలపల్లి వార్డు మెంబరు, గూడెం మొదట్లో డాబా కట్టాడంట - వాడి కూతురు కొడుకు ఉత్తరం రాశాడంట. అది చూసి నీతో చదివిన అప్పసాని మురళి చిన్న తమ్ముడు వాణ్ని తన్నారంట! ఆ అమ్మాయికీ నాకూ ఎప్పట్నుంచో యిష్టం వుందని వీడి గొడవంట! మొత్తం మీద పెద్ద రభస. కాలేజీ మూసేసారు. వీటన్నిటికీ సంబంధించీ, రేపు మండల, పంచాయితీ ఎలక్షన్లకి ఏం చెయ్యాలో తేల్చుకుంటానికి తగువుందట! అదీ ఈ వేళే!”

ఊర్లో పొద్దుటే కనిపించిన ఉద్రిక్త వాతావరణానికి కారణం తెలిసింది. అంతలోనే బాబాయి కేకేశాడు. “ఏరా తూముదాకా వస్తావా?

మనోళ్లంతా కలుస్తారు" నిజానికి నేను కలవాల్సిన వాళ్లెవరూ రచ్చబండ దగ్గర కలువరు. ఈదురుగాలి ఉండి ఉండి వీస్తోంది.

"జీడి తోటల మామిడి తోటల పూతపాడు చెయ్యటానికి ఈ తుఫానొచ్చినట్టుంది" మబ్బుల వంక చూస్తూ అన్నాడు బాబాయి. రచ్చబండకు చేరేలోపల నలుగురైదుగురు పరిచయస్తులు కలిసారు. పొలంలో బోరు తిరిగి వేయాల్సిన పరిస్థితి గురించీ, పొలాల కౌలు గురించీ, చాలా విషయాలు మాట్లాడారు. పెద్దమ్మ చావు ప్రస్తావన వచ్చినా పైపైన మాట్లాడి దాట వేసాడు బాబాయి.

ఆ విషయం మాట్లాడటంలో ఆయనకేదో ఇబ్బందున్నట్టుంది.

మేం చేరేసరికి రచ్చబండ దగ్గర చాలామంది గుమిగూడి వున్నారు. ఇదివరకు వ్యవసాయపు పనులులేని సీజన్లో కొద్దిమంది కూర్చుని 'దాడీ' ఆటో 'పులిజూదమో' ఆడుతూ వుండేవాళ్లు. ఈ మధ్య అక్కడ జనం గుమిగూడే అవసరం బానే వస్తున్నట్టుంది. రచ్చబండ దగ్గర్లోనే 'నిద్రగన్నేరు' చెట్టుకింద జయమ్మ పాక హోటలు కూడా సైజు కొద్దిగా పెరిగింది. జయమ్మ కాసేపు డబ్బులు వసూలు చేస్తూ, అడిగిన వాళ్ళకు చట్నీ వేస్తూ, పెద్ద గొంతుతో పనికుర్రాణ్ణీ, నిద్రమొహం మొగుణ్ణీ గదమాయిస్తూ, పరాచికాలాడే వాళ్ళకి తనదైన పద్ధతిలో సమాధానమిస్తూ మొండి ఖాతాదారుల్ని నిష్ఠూరాలాడుతూ అష్టావధానం చేస్తుంది.

వర్షపు నీరు కాలువగా పోవటాన్కి కట్టిన కల్వర్ట. దాని పక్కన ఓ రావిచెట్టు, వేపచెట్టు. వాటి మానుల చుట్టూ కట్టిన గచ్చులు, రచ్చబండగా వ్యవహరింపబడేది ఆ ప్రాంతమంతా. దానికి దగ్గర్లోనే కొత్తగా కట్టిన పంచాయితీ ఆఫీసు, దానికి ఆనుకొనే ఊరంతటకీ నీరందించే పెద్ద వాటర్ టాంకు. పడమరగా విస్తరించివున్న వూరుకు ఇక్కడ్నుంచి నీరు ఎక్కాలంటే కష్టమే! దానికి కొద్దిగా ఎడంగా ఎలిమెంటరీ స్కూలు గత పాతిక సంవత్సరాలుగా ఏ మార్పుకూ లోనుకాకుండా కాల పరీక్షకు నిలబడి వుంది. పంచాయితీ ఆఫీసు కాంపౌండు వాల్‌కు ఆనుకొని వున్న పాత బిల్డింగ్‌లో ప్రాథమిక వైద్యశాల నేడో రేపో కూలేట్టుగా వుంది. పంచాయితీ ఆఫీసు, వాటర్ టాంకు రాకముందు అదంతా ఖాళీ ప్రదేశం. ఓ పక్కగా రెండు చింతచెట్లు, వాటి నీడలో ఎప్పుడో నడచిన సున్నపు గానుగ అవశేషాలు. బళ్ళు ఊడదీయటానికి, పశువులు నిలవటానికి, అట్ల తద్ది ఉయ్యాలకీ, గోళీ లాటలకీ, బచ్చాలాటలకీ, మాట్లు వేసేవాళ్ళ 'టెంపరరీ నివాసానికి ఆలవాల మయ్యేది. వేసవి కాలపు వెన్నెల రాత్రుల్లో చిన్న కులాలుగా చెప్పబడేవాళ్ళు 'చిర్' ఆట ఆడుతూ పెట్టే కేకలూ, 'అకు' ఆటగాళ్ళ పదఘట్టనలూ రారమ్మని పిలిచేవి ఆ మైదానం నుండే! లాంతర్ల వెలుగులో గోనెపట్టాల మీద కూర్చొని దొంగచాటుగా 'పేష్వా నారాయణరావు వధ' జముకుల కథ ఎంతో ఆసక్తిగా విన్నది ఆ మైదానం నుండే. ఆ కథ అంత ఆసక్తి ఎందుకు రేపిందో ఆలోచిస్తుంటే యిప్పుడనిపిస్తుంది, నా బాల్యం కూడా అంతకేమాత్రం తీసిపోని ప్రత్యక్ష పరోక్ష దాయాదుల యుద్ధాలమధ్య గడచిందే!

తూములపక్కనా, గచ్చు పక్కనా కొన్ని స్కూటర్లూ, సుజుకీ, హోండా మోటారు సైకిళ్ళూ, కొన్ని మామూలు సైకిళ్ళూ ఉన్నాయి. వాటి తాలూకూ ఓనర్లు మిగతా వారితో కలసి తూముల మీదా, చెట్ల కింద వున్న గచ్చు మీదా కూర్చొని వున్నారు. ఆ రెండు స్థలాలూ ఒకరు మాట్లాడితే ఒకరికి వినబడేంత దూరంలోనే ఉన్నాయి. స్థిరంగా వున్నవారు పది పదిహేను మంది కాక వచ్చీ పోయేవాళ్ళూ, కొద్దిసేపు నిలబడే వాళ్ళూ, వివరాలు అడిగే వాళ్ళూ, కాఫీ హోటలు గిరాకీ, రిక్వెస్టు బస్టాపు దగ్గర బస్సు కోసం నిలబడ్డ వాళ్ళతో ... మొత్తం మీద



చాలా హడావిడి అక్కడ కానవస్తుంది.

రాజమండ్రి వైపు పోయే ప్యాసెంజరు బస్సు వచ్చి స్టాప్‌లో ఆగి కొందరిని ఎక్కించుకుని నల్లటి పొగను వదులుతూ సాగిపోయింది. బస్సులో మనవల్ని స్కూలుకు ఎక్కించి,మేము కూర్చున్న వైపుకు వస్తూ నన్ను పలకరించాడు నాదెళ్ల వెంకట్రాయుడు.

"దినానికొచ్చావా? నాల్రోజులుంటావా? ఏంటో ఎవరు సుఖపడుతున్నారో అర్థంగాదు. ఊళ్లు ఊళ్లలా లేవు. ఎట్నుంచి ఏ గొడవ వస్తుందో తెలీట్లేదు. మీరంత ఎటెటో దూరాభారాలు పోయారు. లంబాడి చుట్టరికాలైపోయాయి." ఎటెటో ఉద్యోగాల పేరుతో పోయిన కొడుకుల్నీ, మనవల్నీ తలచుకొని స్వగతంగా అనుకుంటున్నట్లు పలకరించాడు.

"ఉద్యోగస్తులకేం? రేట్లు పెరిగినట్లే జీతాలూ పెరుగుతాయి. చేసినన్నాళ్లు జీతం. రిటయిరయ్యాక సగం జీతం కూర్చున్నా వస్తది. ఉద్యోగాన్ని ఆస్తిలా కొడుక్కో కూతురుకో యిచ్చుకోవచ్చు. మన్లా మట్టిలో కాలు పెట్టే పనేవుంది" ఉద్యోగస్తుల మీది అక్కసంతా తీర్చుకొన్నాడు మాధవరావు. డిగ్రీ చేసింతర్వాత ఉద్యోగ ప్రయత్నాలు చేసాడు. మాకన్నా ఓ పదేళ్ల ముందువాడు. ఉద్యోగం దొరికేలోపే పెళ్లీ, పిల్లలూ. తెలీకుండానే సంసారంలో కూరుకుపోయాడు. అంతే తెలికుండా వ్యవసాయంలోకీ. ఆసక్తిలేని వ్యవసాయం ఎలావుంటుంది? పొరపాటు ఏమిటో తెలిసేలోపే జీవితం చేజారిపోయింది. ఈసడించుకున్న టీచరు ఉద్యోగంలో వున్నవాళ్లు మెల్లగా స్వంత ఊరు చుట్టు పక్కల చేరారు. వెళ్లిన్నాడు స్కూలుకు వెళ్లడం, మానిననాడు మానటం, ఇటుకొద్దో గొప్పో వ్యవసాయం, ఋణాల బాధ పడకుండా ఉద్యోగం ద్వారా వ్యవసాయానికి పెట్టుబడి. వ్యవసాయాలు ఇదివరకులా రేయింబవళ్లు చేసేందుకేం వుంది? మొత్తం మీద మాధవరావుకు ఇదంతా ఉద్యోగస్తుల పట్ల తీవ్ర అసహనం కలుగచేసింది. పనికోసం అయిదొందల కిలోమీటర్లు పోయినవాడి పరిస్థితి మాధవరావు అనుకొన్నంత బాగా ఏమీ ఉండదనీ, అన్ని ఉద్యోగాలూ ఒకే విధంగా వుండవనీ చెప్పి ఉపయోగం ఉండదని తెలిసి ఊరుకున్నాను. ఏమైనప్పటికీ, వ్యవసాయదారుడికన్నా ఉద్యోగస్తుడి పరిస్థితి తప్పనిసరిగా మెరుగ్గా వుందనేది నేనొప్పుకోవాల్సిన నిజం.

"వాటన్నిటికీ యేంగానీ, ఎంతుద్యోగవయినా ఒకడి దగ్గర చాకిరీ యేగా" సిగరెట్టు వెలిగించి అన్నాడు అచ్యుతరావు. ఈ మధ్యే కాంట్రాక్టులు మొదలెట్టాడు. మండలపు ప్రెసిడెంటుకు తోడల్లుడు. రాజకీయ పలుకుబడి అండో ఏమోగాని అతని బిల్లులు జిల్లాపరిషత్తులో ఇంకా ఆగటం లేదు. తను సర్వస్వతంత్రంగా బ్రతుకుతున్నట్లు, ఉద్యోగస్తుల జీవితం తనకన్నా ఉన్నతం కాదు అని తనకే నమ్మకం కల్గించుకోవటం అతని ఉద్దేశ్యంలా వుంది. నేను క్రితం సారి కల్సినప్పుడు తన అక్క కూతురికి మంచి ఉద్యోగం [illegible] కుర్రాడెవరన్నా ఉంటే

# రెండు నదుల మధ్య



చూడమని వెనక ఏమీ లేకపోయినా పరవాలేదనీ, పది లక్షల వరకూ ఇస్తారనీ నాతో అన్నాడు.

అచ్యుతరావు ఉద్యోగస్తుడి సంబంధం కోసం తిరగటం అందరికీ తెలిసినట్టే వుంది. ఈ అవకాశం వదులుకోకుండా నిమ్మలపూడి సూరయ్య అందుకున్నాడు. "ప్రతోడూ పైకి కబుర్లు చెప్పేవాడే. హైదరాబాద్‌లో ఫ్యాక్టరీల్లో ఎనిమిదొందలకి పన్జేసేవాడికి పిల్లనిత్తానం టున్నారుగాని పదెకరాలుండి సాగుజేసే వోడికి పిల్లనిత్తానికి కెవరూ ముందుకు రాటల్లేదు" యాభై ఎకరాలున్న తన కొడుకుని కాదని, వైజాగ్ స్టీల్ ప్లాంట్‌లో పన్జేసే కుర్రాడికి కూతుర్నిచ్చిన పంచాయితీ పాత ప్రెసిడెంటును దృష్టిలో పెట్టుకుని అక్కసు వెళ్లగక్కాడు.

నాకు సంభాషణలో పాలుపంచుకోవాల్సిన అవసరం కలగటం లేదు. ప్రశ్నలూ సమాధానాలూ వాళ్లే చెప్పుకుంటున్నారు. ఎవరి వాదనకు వాళ్లు బలం చేకూర్చే మాటలు మాట్లాట్టమేగాని ఒకరి అవగాహనని మరొకరు అర్థం చేసుకునే ఉద్దేశ్యాల్లో లేరు.

పక్కనే ఎవరితోనో మాట్లాడుతున్న బాబాయి నావద్దకు వచ్చి "చెరువుదగ్గర కర్మ జరుగుతోంది. నేను వెళ్తున్నాను. నువ్వు వస్తావా? లేక ఇక్కణ్ణించి పెద్దనాన్న ఇంటికేవెళ్తావా?" అన్నాడు. నేనేమీ చెప్పక ముందే మా గంగాధరం "ఇద్దరం కల్సి పెద్దనాన్న వాళ్లింటికే వెళ్తాంలే! మీరు చెరువు వద్దకు వెళ్లి రండి" అన్నాడు. "సరే"నంటూ బాబాయి చెరువు వైపు బయలు దేరాడు.

ఎవరో అబ్బాయి పరుగెత్తుకు వచ్చి గంగాధరానికేదో చెప్పి తిరిగి పరుగెత్తుకు పోయాడు. "అమ్మ నిన్ను పెద్దమ్మ వాళ్లింటికి నడవమని చెప్పి పంపిందిలే!" అన్నాడు నావైపు తిరిగి. మరెవరో వాడు పనిచేసే సొసైటికి రాబోయే ఎరువుల గురించి అడుగుతున్నారు. గంగాధరం వాళ్లతో విసుగ్గా మాటాడుతున్నాడు.

ఉండుండి గాలి ఈడ్చికొడుతుంది. మబ్బులు నల్లబడుతున్నాయి. చేతిలోకి టీ గ్లాసు వచ్చింది. అప్రయత్నంగా తాగటం మొదలు పెట్టాను. ఏవో ఆలోచనలు.... ఇప్పుడున్న నా స్థితి మంచిదో చెడ్డదో తెలుసుకుని సవరించుకోగల స్థాయిలో లేను. అక్కడికి ఓ విధంగా తరమబడ్డానా? అక్కడి వాళ్లంతా ఎవరి మాటల్లో వాళ్లు పడిపోయారు. నేను నాకు తెలియకుండానే తచ్చాడసాగాను.

ఊహ తెలిసేసరికి ఇంటినిండా మనుష్యులు... ఇంట్లో ప్రతిరోజూ వచ్చేపొయ్యేవారితో ఇల్లు తిరణాల. చుట్టపక్కాలకు వంటా వార్పులు. స్కూళ్లకుపోయే వాళ్లు కొందరు. ఆటలకు తిరిగేవాళ్లూ, పెత్తనాలకి తిరిగేవాళ్లూ, చింతపిక్కలాడేవాళ్లూ... ఇంట్లో కొత్తకొత్త చుట్టాలు. ఇంట్లో అంతమంది వున్నా ఒంటరిగా మౌనంగా పనులతో సతమతమయ్యే అమ్మా! పెనుభారాన్ని మోస్తున్నట్లుగా నాన్న......

ఓ పక్కగా పెద్ద మట్టిదిబ్బ. పక్కనే వెడల్పయిన నుయ్యి. నల్లగా విచిత్రంగా డుంగుడుంగుమని శబ్దం చేస్తూ సన్నని గొట్టంతో వేడినీళ్లూ, లావాటి గొట్టంతో చన్నీళ్లూ తోడిపోసే ఆయిలింజను. ఆ నీటిని అపురూపంగా వాడుతూ పెంచిన పచ్చటి టమోటా మిరపచేలల్లో ఆరుద్రపురుగుల్లా ఎర్రెర్రగా మెరిసే టమోటా, మిరప పండ్లు. దూరంగా చెయ్యెత్తు పెరిగిన జొన్న చేలల్లో మంచెమీద నుండి వినవచ్చే నాటకం పద్యాలూ, పైరగాలి విసురుకు పరవశించిపోతూ ఎగిరెగిరి దూకుతూ 'జాడు' చేలో జారబడబోయే 'రావుడావు' దూడా, మెళ్లో చిరుగంటలు మోగిస్తూ చిట్టూ, ఉలవలూ ఆబగామేసే గిత్తలూ... ఆ వయసులో ఇవి ఆకర్షించనిదెవరిని? ...... దానికి నేను మినహాయింపు కాదు.

ఒక రోజు - స్కూలు నుంచి వచ్చేసరికి ఇల్లంతా హడావిడిగా వుంది. అరిపిరాల సత్యంగారు తన భారీ శరీరాన్ని బల్లమీద కూలేసి అరుస్తూ ఏమేమి కావాలో చెబుతున్నాడు. ఇంటి ముందు నేరేడు చెట్టుకింద గూడు బండి వుంది. తోట్లో గడ్డిని లాక్కుంటూ గిత్తలు మేస్తున్నాయి. వట్టి (ఎండు) గడ్డిని ఎద్దులు మేసేటప్పుడు పరపరా వచ్చే శబ్దం. సన్నటితడి తగిలి ఆ గడ్డి నుండి వచ్చే వాసనా మనసారా ఆస్వాదించి ఇంట్లోకి పరుగెత్తాను. నా ప్రమేయం లేకుండా పనులన్నీ జరిగిపోతున్నాయి. కొబ్బరికాయలూ పూలు, మాలలూ, అగరొత్తులూ, దేవుని పటం, ప్రసాదాలు అన్నీ....మొత్తం మీద రెండు బళ్లలో బయలుదేరాం. గంట ప్రయాణం తరువాత బళ్లు ఆగాయి. కొత్తగా కట్టబడ్డదో షెడ్డు. ప్రక్కన కొత్త పైపులు. షెడ్డులోపల పూజ. పెద్ద గొంతుతో సత్యంగారి పూజ అయ్యింది. వాచీ వంకచూస్తూ

"ఆఁ! టైమైయ్యిందిరా" అన్నాడు. చెక్కబల్లమీద రెండు ఇనుప పెట్టెలూ మూడు కరెంటు బల్బులు వున్నాయి. నాన్న ఆకు పచ్చరంగులో వున్న స్టార్టరు నొక్కారు. బల్బులు ఓమారు కాంతి తగ్గాయి. కొద్దిగా శబ్దం. తర్వాత జలజలమంటూ పైపులోంచి ధారాపాతంగా నీళ్లు. మాకు బోరు పడిందట!

కొద్ది రోజుల తరువాత మా ఇంటి పక్కనున్న మాదాయాదుల పెద్ద భవంతి ముందు ఆడుకుంటున్న నాతో నాకు పిన్నివరసయ్యే శేషారత్నం కళ్లు పెద్దవి చేస్తూ, గొంతు ఏదోలాపెట్టి అంది "బోరు పడిందిగా, ఇక మీరూ పైకొచ్చేత్తారు' పైకి రావటమేదో నాకైతె అప్పుడు ఏమీ అర్థం కాలేదు. కాని ఏవో కొత్త విషయాలు మెల్లగా తెలుస్తున్నాయి.

వందెకరాల వ్యవసాయం పంచుకుపోయిన వాళ్లకు పోగా అరవై ఎకరాలు నాన్న చేతికొచ్చింది. పెద్దకుటుంబం. పెళ్లి కావాల్సిన మేనత్తలు, చదువుల్లో వున్న బాబాయిలు. దారుణమైన నీటి కటకట. అంత భూమి వుండీ ధాన్యం కొనుక్కోవాల్సిన దుస్థితి. సాంప్రదాయ వర్షాధార వ్యవసాయాన్ని మార్చాల్సిన పరిస్థితులు. నీటి కోసం భూగర్భంలోకి చొచ్చుకు పోవాలి. నీళ్లుపడేచోటు చెప్పే శాస్త్రీయ పద్ధతులు సాధారణ రైతుకుఅందుబాటులోకి రాలేదు. మూడు చోట్ల బోరు ప్రయత్నాలు చేయగా మిగిలింది నలభైవేల అప్పు! ఈ లోపులో మేనత్త పెళ్లి అప్పుమీద అప్పు!

ఆ పరిస్థితుల్లో బోరు పడటం అదృష్టమే. బోరుపడితె తీరింది నీటికరువే. ఆ బోరుపడ్డ పొలం అడివిలాంటిది. దానిని బాగుచేసి వ్యవసాయ యోగ్యం చేసేసరికి మరికొంత అప్పు. వ్యవసాయపు పెట్టుబడికి మరికొంత. తొమ్మిది పదేళ్ల వయసు ఎంత నిష్పూచీ బతుకే అయినా, అప్పటికి పూర్తిగా ఏమిటో తెలియకపోయినా తనకు అచిన్న వయస్సుల్లో అర్థమైంది. ధారుణమైన ఒంటరి తనంతో బ్రతుకుపోరు సాగించేనాన్న.... వ్యవసాయపు పనులమీద పోయిపోయివచ్చి రాత్రి వేళలో భోజనాలు అయేక రేడియో ట్యూన్ చేస్తూనే వుండేవాడు.



అనేక స్టేషన్స్, అనేకానేక భాషల్లో చిత్రవిచిత్ర స్వరాల్లో, ఏదో ఒకానొక స్వరంకోసం నాన్న నిరంతరం వెతుకుతున్నట్టే వుండేది. ఆయనకు రోజూ రాత్రి వివిధ భారతి పాటలు వినడం ఒక అలవాటు. నాన్న పట్ల ఏదో తెలీని గౌరవం. అన్ని వత్తిళ్లలోనూ ఏనాడూ పల్లెత్తు మాటనని నాన్నను చూస్తే పొంగిపొర్లే అభిమానం. ఆ అభిమానమే నిద్రబోయే నాన్నకు విసనకర్ర విసిరేట్టూ, వేడెక్కిన పాదాలకు కొబ్బరినూనె రాసేట్టూ చేసేది.

పొగాకు పంటలు వచ్చాక 'అప్‌లాండ్' ఏరియా రైతుల పరిస్థితి కొంత మెరుగయ్యింది. దానితో పాటే నీళ్లు వచ్చాక అంతక్రితం బాగా కాయని మామిడి తోటల ఫలసాయం పెరిగింది. మా పరిస్థితి కూడా బాగయినట్టే వుంది.

ఆరోజు కవి విశ్వనాధ సత్యనారాయణ చనిపోయిన రోజు. స్కూలుకు సెలవిచ్చారు. పుస్తకాలు ఇంటిదగ్గర వదిలిపొలం వెళ్లిపోయాను. నాన్న కరెంటు బిల్లుకట్టటాన్కి గూడెం వెళ్లారు. నేను వెళ్లేసరికి 'చంద్రిగాడు' నాగలి దున్నుతున్నాడు. పట్టుబట్టి లాక్కున్నాను. రెండు కొండ్రలు పోశాను. అంతలో మోటారు ఆగిపోయిందని నూతి దగ్గర్నుంచి వీరాస్వామి కేకేసాడు. నాగలి చంద్రిగాడికి వదిలి అటుపరుగెత్తాను. నాన్న వచ్చేటైమయ్యింది. వచ్చి స్నానం చేస్తారు. ఇవాళ నమస్యాపూరణం రాయించేయాలి. నాన్నజేబు లో పెన్నూకాయితం వుంటాయి. "ఏంట్రా ?"అడిగాను "మోటారు గాలి బట్టింది అయ్యగారూ" అన్నాడు వాడు. నాకు మంచి అవకాశం దొరికింది. చొక్కావిప్పి చకచకా ఊసమెట్ల మీదినుంచి లోపలికి దిగి మోటారు పంపు గాలి సీలవదులు చేసాను. 'టుస్' మని ముందుగాలి దాంతోపాటే నీరూ బయటకు చిమ్మింది. సీల బిగించి పైకొచ్చి మోటరు ఆన్ చేసాను వెంటనే నీరెత్తుకుంది. "ఈ సారి మోటారు కాలిపోతె ఏలూరు పట్టుకెల్లం నేను కట్టేస్తాను వైరింగు" గర్వంగా వీరాస్వామితో చెప్పాను.

పాతిక ఎకరాల చెలకమాది. పొడుగ్గా వుండేది. ఒక చివర బోరు. అక్కన్నించి చూస్తే దూరంగా రెండోచివర కనిపించేది. అక్కడ తడికె. అట్నుంచే రావాలి నాన్న. పెద్దపెద్ద అంగల్తో ఎత్తైన రూపంతో తెల్లటి ఖద్దరు బట్టలతో, చేత్తో కర్ర పట్టుకు వచ్చే నాన్నను చూస్తుంటె చూచి ఎన్నో గంటలు కాకపోయినా ఎప్పుడిక్కడికి చేరుకుంటాడా అనిపించింది. మధ్యలో కలిసిన చంద్రిగాడితో మోటారు దగ్గరిదాకా వచ్చాడు. "కొద్దిక్కూడా వంకర లేకుండా కొండ్ర బెమ్మాండంగా పోశారు చక్రం బాబుగారు" చంద్రిగాడు చెప్పాడు. "వద్దంటున్నా వినకుండా నూతిలో దిగి గాలొదిలారు" వీరాస్వామి తాను చెప్పాల్సింది చెప్పాడు. నాన్న మొహంలో తప్పనిసరిగా మెచ్చుకోలు కనిపిస్తుందని ఆశగా చూశాను. లేశామాత్రంగా ఆనందవీచిక, వెంటనే ఏదో ఆందోళన నాన్న మొహంలో కనిపించాయి.

ఊరిలో వీధిలైట్లు దూరంగా కన్పిస్తున్నాయి. సినిమాహాలు! పాటలు వినవస్తున్నాయి. ముందు నాన్న, వెనుక పాలేర్లు, మధ్యలో నేను మెత్తటి ఇసుకు పుంత. సన్నటి ధూళి గాలికి లేచి నోట్లో పడుతోంది. చిత్రమైన రుచి. నాన్న నాతో ఎందుకు పెద్దగా మాట్లాడలేదో అర్థం కాలేదు. మొత్తం మీద నా పొలం రాక విషయంలో నాన్నకేదో అభ్యంతరం వున్నట్టనిపించింది.

అప్పుడు పదోతరగతిలో వున్నాను. హెడ్మాష్టరు ఇంట్లోనే రాత్రుళ్లు నిద్ర. ఆయన పడుకున్నాకా ప్రతి సినిమా టూరింగ్ హాల్లో సెకెండ్ షో చూడాల్సిందే. ఆ సారి మహేశం వాళ్ల షాపులోంచి ఎత్తుకొచ్చిన డబ్బులు అందరికీ సరిపోవట్లేదు. నేను తెస్తానని యింటికి వచ్చాను. తడిక చప్పుడుకి వాకిట్లో రేడియో వింటున్న నాన్న లేచి నన్ను చూసి 'ఎంట్రా' అని అడిగాడు ... పుస్తకం మరిచిపోయాను" తేలిగ్గా సమాధానం చెప్పి లోపలికి వచ్చాను. మిషన్ బాక్సులోంచి డబ్బులు తీసుకుని చేతికందిన పుస్తకంతో బయటకు వచ్చాను. "చీకటిగా వుంది జాగ్రత్త" అంటూ టార్చ్‌లైటు ఇచ్చాడు. బ్యాటరీలు తీసేయటం వల్ల రేడియో మూగగా మంచం కోడు దగ్గరుంది.

అంతే! పరీక్షలు అయ్యేంత వరకూ మళ్లీ సినిమా చూడలేదు.

"విషయమేంటో తొరగా తేలిస్తే వదిలిపోద్ది. ఎవరి పనుల్లోకి వారు పోవచ్చు. అవతల పొగతోట జిడ్డుతీతకు కూలోళ్లు వస్తారు. నాపక్కన చేరి గట్టిగా అన్న నాగళ్ల బ్రహ్మయ్య మాటలకు స్పృహలో కొచ్చాను.

నా చేతిలో టీ ఆరిపోయింది.

"కొత్త విషయమేవుంది ? ఊళ్లో జరుగుతున్న విషయాలు అందరికీ తెలిసినవయ్యే గదా. ఇన్నిరోజులు మనలో మనం ఎన్ని పడినా సరిపోయ్యేది. ఇప్పుడు పరిస్థితి అదికాదు. మాలగూడెం వాళ్లైతేనేవి గవళ్లగూడెం అయితేనేం, ఎవరికీ మన మాటలెక్కలేదు. ఎక్కడికక్కడ గొడవలు అవుతున్నాయి మొన్నటి దాకా పుంతల్లోనో, పొలం సరిహద్దుల్లోనో తగువులొచ్చేయి. బస్టాండ్‌లో దిగి చీకటి పడ్డాక మన ఆడోళ్లు ఒంటరిగా రావటానికి బయపడ్తన్నారు. దీని విషయంలోనూ మనమంతా ఏం చేయాలో ఓ నిర్ణయానికి రావాలి. పంచాయితీ మొన్నటిదాకా మన చేతిలో వుండేది. ఆర్నెల్లక్రితం పోయిన ప్రెసిడెంట్ తోనే మన అదుపు కూడా పోయినట్టనిపిస్తుంది. ఇప్పుడు మనం తీసుకునే నిర్ణయం రేపు ఎలక్షన్ల మీద కూడా ప్రభావం చూంచుద్ది.' ' ఉపోద్ఘాతంగానూ, మొత్తం మీటింగుకు తానే పెద్ద అన్నట్టు చెప్పాడు బలుసు సోమసుందరం. లోకల్ ఎం.ఎల్.ఏ ఊళ్లోకొస్తే ముందు వాళ్లింటికే వెల్తాడు. జి.యం.టి రోడ్డు రవాణా భూములు ముందు చూపుతో చాలాకాలం క్రితమే కొన్నాడు. వాటిలో యిప్పుడు మిల్లులు ఫౌండ్రీలు లాంటివి పెట్టించాడు. మేనత్త తరపు ముదనష్టం కలవటంతో గ్రామంలో ముఖ్యుడై పోయాడు.

"కర్మకోసం చెరువుకెల్లిన వాళ్లు తిరిగి రాలేదా?" అని అప్పుడే వచ్చిన మరో రైతు ఎవరినో అడుగుతున్నాడు. "వస్తూందీవుంటారు' ఎవరోజవాబు. నేను పెద్దమ్మ వాళ్లింటికి వెళ్లాలి. ఆలస్యం అవుతోంది.

ఆకాశంలో వేగంగా కదిలే వానమబ్బులు. ఈదురుగాలులు.

పంచాయితీ వద్ద ఇంత గందరగోళం జరుగుతున్నా ఏమీ పట్టనట్టుగా రెండు చేతుల మధ్యగడ్డాన్ని వుంచి గట్టుమీద బాసంపట్టు వేసుకు కూర్చుని దూరంగా చూస్తున్నాడు మధుసూదనం. అటువైపు తలతిప్పి పేరుపెట్టి పలకరించాను. ఆ పిలుపు ఆయన్ని చేరినట్టులేదు. "వాణ్ణింకేం పిలవకు. వాడికేం వినపడదు. నిరుడూ ముంగటేడు పంటలు కలిసొచ్చి కాసిని డబ్బులు వెనకేసాడు. అవి తీసుకువెళ్ళి వాళ్లావిడపోరు పడలేకబామ్మర్దితోకలిసి అడివి జీడి తోటల్లో పెట్టాడు. చాలా మందికి వాటాలున్నాయిలే !



ఈడేమో ఎక్కడైనా తోటల్లో దొంగతనాలు జరిగాయన్నా, ఇలా వర్షం కురుస్తుందన్నా, జీడిపూత ఏమైపోద్దోనని, జీడిపిక్కలు ఎవడైనా ఏరుకుపోతాడోనని తెగ ఆలోచిచ్చేస్తాడు... దాదాపు పాతికొందల ఎకరాలు..... చీపుగానే పాడారంటలే" వివరంగా చెప్పాడు గంగాధరం. బలవంతంగా నవ్వాడు మధుసూదనం.

"ఇంకాసేపట్లో అవతలి పక్క పెద్దమనుషులు వస్తారు. ఈ లోపు మనం ఏమాటా ఆలోచించి ఆళ్లతో మాట్లాడాలి" ఎవరో అన్నారు.

"చివరికి ఆళ్లని కూడా మనతో కూచోబెట్టి మాటాడాల్సిన కాలం వచ్చింది." ఎంతోబాధతో అని, ఆ బాధ కోపంగామారగాచుట్ట చివర కసుక్కున కొరికి ఊసాడు నారినేని నరసింహారావు. వయసైపో వచ్చింది. మాచిన్నప్పుడు అయన గురించి చెప్పేవారు. అయన జనాలతో నోటితో మాట్లాడ్డని, చెయ్యే మాటాడుతుందని.

"రోజులన్నీ ఒకేలావుంటాయా బావా? ఇక్కడింకా నయం.మా దగ్గర పదిపదిహేను ఏళ్లక్రితమే పరిస్థితులు మారిపోయాయి." గుంటూరు జిల్లా నుండి అత్తగారింటికి వచ్చి స్థిరపడ్డ వాసిరెడ్డి రాఘవులు అన్నాడు.

"పరిస్థితులెందుకు మారవు. మనోళ్లు తిన్నగా ఏడిస్తేగా. సరీసుగా ఎవసాయం చేసేవోడెవడూ? సాయింత్రం అయ్యేసరికి పెతోడూ రోడ్డెక్కాల్సిందే. పొలం గట్టున నిలబట్టానికి నామోషీ. మాగాణీల్లోకూడా తోటలు పెంచేసారు. పోనీ అయ్యన్నా సొంతంగా గింజ ఏరరు. కాయలు కొయ్యరు. తోటలన్నీ ఆళ్లకే అమ్ముతారు. ఆళ్లకి యాపారం అలవాటు చేసారు. ఆళ్ళు లాభాలొత్తే దబ్బిత్తారు. నష్టం వత్తె చేతులెత్తేత్తారు. ఆళ్లని పెంచిందే కాదు, ఆళ్లకి ఈ బుద్దుల్ని నేర్పిందీ మనమేకదూ?" అన్నాడు. నారయ్య. వయసులో వుండగా ఒక గడ్డి బండి కెళ్లినా, అదివికి కంపనరకటానికి వెళ్లినా పక్కనున్నోళ్లు ఈయన పనిచూసి ముక్కున వేలేసుకోవాల్సిందే. నీతీ నిజాయితీ విషయాల్లో కూడా మనిషి ఖచ్చితమైన వాడే. అవేశం తగ్గలేదు. ఖాండ్రించి ఉమ్మాడు.

"సుకంగా బతికే అవకాశం వున్నపుడు ఎవడు కావాలని కష్టపడతాడు. నువ్వు వ్యవసాయం చేసినపుడు పాతికేలు ఒకేసారి నీ చేతిలో పడ్డాయ్యా ? కూలోళ్లని బతికిస్తానిక్కాపోతే వ్యవసాయం ఎవణ్ణి వుద్ధరిత్తంది? అయినా ఆళ్లని నమ్ముకుని వ్యవసాయం చేస్తే నట్టేట్లో ములిగినట్టే. నడుంవంచి నాలు గ్గంటలు చేలో ఎవడైనా వుంటన్నడా ? ఆళ్లకి నా బామ్మర్ది పంపిన అమెరికా గడియారం మీద కన్నా చర్చిగంటల మీదే నమ్మకం ఎక్కువ. చర్చిగంటలు మోగగానే నాలుగైందని గట్టు ఎక్కేస్తారు' నారయ్య తమ్ముడి కొడుకన్నాడు.

"మీరు పాతికేలు పదేలు అంటూ కూసోండి. ఇక్కడ కాయలు కోసి నాగపూరుకు లోడెయ్యటాన్కి మీకు బరువు. ఆ పని చేసినందుకు మీకిచ్చినంత ఆళ్లకి లాభం వత్తది" ఇంకో పెద్దాయన.

"ఆఁ.... ఏగాలి దుమ్మో ఒక దెబ్బ కొట్టిందంటే కాయంతా రాలుద్ది. అప్పుడేం చేత్తావేంటి?" ఒకింత విసురుగా అన్నాడు కాట్రగడ్డ సూర్యం.

"కాయంతా రాలిపోతె నీకు దక్కేది అడ్వాంసిచ్చిందే! మిగతా డబ్బు ఆడిస్తాడు, నువ్వు పుచ్చుకుంటావు."

"ఈ ఏడు డబ్బియ్యకపోతె వచ్చేఏడు ఏమొహం పెట్టుకు తోట అడుగుతాడు ?"

"అప్పుడు నీ దగ్గర కెందుకు వస్తాడు? వైజాగ్‌లో వున్నదేవిని రాజారావు దగ్గరకో, హైదరాబాద్‌లో పర్వతిని భాస్కర్రావుకో ఆడ్వాన్సిచ్చి వస్తాడు"

" మనలో కట్టులేనంత వరకూ ఆళ్లకేం ఫర్లేదు"

"మనం కట్టు గడితె ఏమయ్యింది ఇంతకు ముందు ? పన్లోకి ఆళ్లని రానీయకపోతె ఆడివిలో పుల్ల కొట్టుకున్నారు. ఫారెస్టరు మన డబ్బుతిని వాళ్లని పుల్ల కొట్టుకోనిచ్చాడు. కొత్త వెసులు బాటువున్నాడు పుల్లయాపారం చేసాడు. సులువులన్నీ మనం నేర్పినయ్యే !"

"సర్లే వాళ్లలో మాత్రం పై కొచ్చిన వాళ్లెందరు ? ముగ్గురు నలుగురుంటారు వాళ్లు తమకిందోల్లకు చేసిందేవుంది? జనాలను చూపించి కాంట్రాక్టు సంపాదించటమో, రాజమండ్రి పేపరు మిల్లుకి కలపతోలే పర్మిట్లు తీసుకోవటమో మినహా" అంటూ చెప్పుకొచ్చాడు అక్కిని నాగేంద్రం.

"కనీసం కాయమీదున్నపుడు అమ్మితే తోటకు మంచి రేటొస్తుంది' ' మళ్లీ తోట విషయం ఎత్తాడు రిటైర్డ్ టీచరు సుందర్రావు.

"పరువు మీదకొచ్చేదాకా ఆపి అమ్మటాన్కి నెలనెలా మాకు పించన్లేవీ రావట్లేదు" ఉక్రోషంగా అన్నాడొకాయన. ప్రతీ సంవత్సరం ఏదోఒక అవసరం ఆయన్ని తోటని ముందే అమ్మిచ్చేస్తుంది.

"సరె! ఈ విషయాలు ఎప్పుడూ ఉండేయే. ఇప్పుడు తగువులో ఏం మాట్లాడాలో చెప్పండి" అన్నాడు ఇంకొకాయన.

"ఏవుంది? మళ్లీ ఇంకోసారి మనోళ్ల జోలికివస్తే మర్యాదగా వుండదని. ఏం జరిగినా మన బాధ్యతలేదని వాళ్లకి చెప్పాలి." గట్టిగా చెప్పాడు బ్రోకరు సత్తయ్య. ఆయన కూతురు గురించే బస్సులో గొడవయింది. పుగాకు షావుకార్లకీ, రైతులకీ మధ్య మధ్యవర్తిగా బాగానే సంపాదించాడట. రాష్ట్రంలో అధికార పార్టీకి - క్రియాశీలక కార్యకర్త.

"వాళ్ల కామాట చెప్పే ముందు మన పిల్లల్ని కాస్త జాగ్రత్తచేసుకుంటె బావుంటది" నెమ్మదిగా అన్నాడు నాదెళ్ల వెంకట్రాయుడు.

"నీ ఉద్దేశం ఏంటి పెద్దయ్యా' కోపంగా అడిగాడు సత్తెయ్య.

"ఆడపిల్లల్నేకాదు. మన మగపిల్లల్ను ఉద్దేశించి కూడా అంటున్నాను. నేను వయసులో మీకంటే పెద్దోణ్ణి లోకం చూసినోణ్ణి. ఇవి పయికి కనిపించినంత చిన్న విషయాలు కాదు. మీరు గట్టిగా చెప్పినంత మాత్రాన మళ్లా జరుగకుండా వుంటాయని అనుకోకండి. మనవయినా కాలాన్ని బట్టి నడవాలి అన్నాడు వెంకట్రాయుడు.

"ఏంటీ కాలంబట్టి నడిచేది. ఇవాళ బస్సులో మీద పడ్డారు. రేపు చెయ్యి పట్టుకొంటారు. మనం గాజులు వేసుక్కూర్చుంటే ఏవైనా చేస్తారు." అన్నాడు అప్పసాని మురళి. వాడు నా క్లాస్‌మేట్. డిగ్రీచదువుతూ మానేసాడు.

"సరే ! దానికేవుందిలే ! నిన్నటిదాకా మనం చేసిందదేగా ఇవాళ వాళ్లదగ్గర నాలుగు రూకలు చేరాయి. మనంచేసిన పన్లు వాళ్లూ చెయ్యాలనుకొంటారుగా" ఒక యువకుడు అన్నాడు. ఆ యువకుని వంక వెంకట్రాయుడు ప్రశంసా పూర్వకంగా చూసాడు. అప్పసాని మురళికి ఆ మాటలు గట్టిగానే తగిలాయి. చిర్రుబుర్రులాడుతూ మోటారుబైక్ స్టార్ట్‌చేయ బోతుండగా 'నేను వస్తున్నా' నంటూ



వేరేయువకుడు మురళి బండెక్కి వెళ్లిపోయాడు.

"చూడరా ! యిప్పటి దాకా మురళిగాడు కులం కులం అని తెగయిదైపోయాడు ఇప్పుడు ఆడితో బండెక్కి పోయినోడెవరో తెలుసా? మాలపల్లి డ్రిల్ మాస్టర్ కొడుకు ఈ మధ్యే రేషన్ షాపు డీలర్ షిప్పు సంపాయించాడ్లే" గంగాధరం అన్నాడు నాతో.

"నాలుగు డబ్బులొస్తే సరిపోద్దా ? కుక్క బలిస్తే బండిలాగుద్దా" ? చాలా ఆవేశంగా అన్నాడు నరసింహరావు.

ఆ ప్రశ్నకు సమాధానం ఏమిటో అందరి మనసుల్లోనూ లీలగా తెలుస్తుంది ఇదమిత్థంగా ఏమీ చెప్పరానిది. కొద్ది సేపు నిశ్శబ్దంగా వుంది. సన్నసన్నగా చినుకులు ఏటవాలుగా పడుతున్నాయి. గాలి విసురుకి చినుకులు అలల్లా కదుల్తు న్నాయి. కొంత మంది అరుగుమీది నుంచి లేచి జయమ్మ పాక కిందికి పోయారు. మరికొందరు జల్లును లెక్క చెయ్యనట్లు కదలకుండా కూర్చున్నారు. కొందరు లేచి నుంచుని నీడకు వెళ్లటమా మానటమా అని తటపటాయిస్తున్నారు.

మబ్బుల వల్ల సమయం తెలియటం లేదుగాని పదిగంటలు దాటుతుంది. పెద్దమ్మ దినంకు చెఱువు దగ్గరకు వెళ్లిన వాళ్ళు ఈ పాటికి వెనక్కి తిరిగి వుంటారు. ఏలూరుకు పోయే బస్సులు రిక్వెస్టు బస్టాప్‌లో ఆగిపోతున్నాయి వాటిల్లో దిగిన మా పెద్దమ్మ వైపు చుట్టాల్లో కొందరు పెద్దాళ్ళు ఇస్త్రీ మడతల దుస్తులతో అరుగుల వైపు చూసుకుంటూ వెళ్తున్నారు. రిక్షాల్లో కొందరు స్త్రీలు, స్కూటర్లమీద కొందరు మా యిళ్లవేపు వెళ్తున్నారు.

గంగాధరం లేచాడు. నేను కూడా లేచి కొద్దిగా ముందుకు వచ్చాను "వీళ్ల ఇంకో పదిరోజులు చర్చించుకున్నా ఒకమాటకి రాలేరు. వాళ్లేం చెయదల్చుకున్నారో వాళ్లకే తెలీదు. వీళ్లలో ఏ ఇద్దరికీ ఒక రంటే ఒకరికి పడదు. ఇలాంటి విషయాలేవైనా వస్తే 'మనం మనం' అంటూ మొదలెడతారు. వీళ్లలో వీళ్లకి గొడవలున్నట్లే అవతలి వాళ్లతో ప్రతివాడికీ ఏదో ఒక విషయంలో గొడవలున్నాయి. వాటి తాలూకూ కక్షలేవైనా తీర్చుకోవచ్చునేమోనని వీళ్ల ఆశ....." అంటూ గంగాధరం కాసేపు ఆగి "నేను వీళ్లలో కలువనని నామీద కోపం. ఏమైనా అంటే ఫేను కింద కూచునేవాడివి ఈ బాధలేం తెలుస్తవిలే అంటారు" అన్నాడు.

ఈ హడావిడి అంతా చూస్తుంటే ముగింపుముందే తెలిసిన సినిమా చూస్తున్నట్లనిపిస్తుంది. ఆసక్తి చచ్చిపోయింది. రైలు ప్రయాణం మొదలయ్యి, విజయవాడలో రైలుమారి ఏలూర్లో బస్సు మారి ఊరికి సంబంధించిన రకరకాల అనుభూతులకు లోనౌతూ, కాలయంత్రంలో ఎక్కి పాత రోజుల్లో పోగొట్టుకున్న అనుభవాల్ని అందు కోవటానికి వచ్చినట్టు ఇంటికి వస్తే, వచ్చిన కాసేపటికే ఊహలన్నీ ఆవిర్లవుతాయి. కాలగతిలో మార్పులకు నేను లోనౌతూ ఊరిని యధాతదంగా ఉండాలనుకోవటం లాజికల్‌గా కరెక్టు కాకపోవచ్చు. అయినప్పటికీ చాలా విషయాలలో లాజిక్ పనిచెయ్యదు. ఆశపడటం విషయంలో మరీను.

నేను ఇక్కడే వున్నట్టు అయితే వీళ్లలో ఒకడిగా చర్చలో పాల్గొనేవాన్నా ? జ్ఞాపకాలన్నీ పార్లిపార్లి ప్రశ్నలయ్యాయి.

"మీ పెద్దమ్మ దినానికొచ్చావా?" ఎవరో నన్ను అడుగుతుంటె గంగాధరం అవునని చెబుతున్నాడు. రోడ్డుమీద పోతున్న వాహనాల వంక చూస్తూ వెంకట్రాయుడు "మీ నాన్న పోయిన దగ్గర్నించి మనసులో మాట చెప్పుకోవటానికి ఊళ్లో మనిషన్నవాడెవడూ లేకుండా పోయాడు' ' అని నిట్టూర్చాడు.

నాన్న ఎప్పుడూ ఎందుకు అందరికీ భిన్నంగా కన్పించేవాడు? తగువులు తీర్చడానికి పెద్దమనిషిగా మేడ (రామాలయం)మీదికి ఎందుకు వెళ్లేవాడు కాడు! ఏ ఒక్కరితోనూ వ్యక్తిగతంగా తగువులేదు అయినా ఎవరితోనూ మనస్ఫూర్తిగా కలిసినట్లుండేవాడు కాడు. సరియైన స్నేహం దొరక్క విపరీతమైన వెతుకులాటలో వున్నట్టుండేవాడు. ఆ వెతుకులాటలో భాగంగా సాహిత్యం చదవటం. రేడియోట్యూన్ చేస్తుండటం - మరేవో ఆసక్తులు పెట్టుకునేవాడు.

కాలం గడిచినా కొద్దీ నాకు నాన్న ఎందుకు పదేపదే జ్ఞాపకం వస్తున్నాడు ? నాన్నకు ఒంటరితనం ఎక్కడి నుంచి సంక్రమించింది ? ఎవరికైనా సరే ఒంటరితనం ఎలా సంప్రాప్తిస్తుంది? సమకాలీన జీవితం పట్ల అసంతృప్తి వుండి. తమ జీవితవిధానాలలో లోటుపాట్లు తరచి చూసుకునే వాళ్లందరికీ ఒంటరి తనం తప్పదేమో! నాన్నకులాగే తనకు ఒంటరితనం ఎంతో కొంత వచ్చేసిందా ?

నాన్న తండ్రిపేరు చినరామయ్య. ఆయన వాళ్లనాన్నకి ఒక్కడే కొడుకు. ఆయన పెదనాన్నకు నలుగురు కొడుకులు.

ఆస్తులు పంచుకున్నాక వాళ్లు నలుగురికి కలిపి నూటాపది యెకరాలు ఈయన ఒక్కనికే నూటాపదియెకరాలు వచ్చాయి. ఆయన జీవితం మొత్తం కోర్టుల వెంట తిరగటాన్కి, ఆయన్ను ఆయన కాపాడుకోవటానికి సరిపోయింది. భూమిని సరిగా ఉపయోగించుకోలేక పోయాడు. ఒంటరి పోరాటంలో బాగా అలసిపోయాడు. శత్రువర్గం అంగబలంతో చుట్టుముట్టేది. అవుతలి పక్షంలో నలుగురు అన్న దమ్ముల్లో ఒకరు రెచ్చగొట్టేవాళ్లు. వేరొకడు చేలగట్ల తగువుల్లో ఆవేశంగా తాతపాలేర్లమీద దాడిచేసే వాడు.ఇంకొకాయన పెద్దమనిషి తరహాలో వచ్చి సర్దిచెప్పేవాడు. అలా పనులు చేసేందుకూ, సర్దిచెప్పేవాళ్లు వెనుకలేకా, అంగబలంలోపించడం వల్ల, తనమెతకదనం వల్లా, భరింపరాని ఒంటరితనంతో బాధపడేవాడట తాత. ఈ ఒత్తిళ్లన్నింటినుంచి బయట పడేందుకు పిలుచేసుకొని నాటకాల్లో పాల్గొనేవాడట. ఇప్పుడు మా ఊరినానుకొని వున్న పల్లెలో మాలపల్లి వున్నచోటు మా తాతదేనట ! మా తాతకు చెందిన భూమిలో ఆయన దాయాదులు కొందరు మాలలూ కలిసి నాగళ్లు కడితే మాలపల్లిలో వాళ్లందరూ మా తాత తరపున తమ సొంత నాగళ్లు కట్టారట.

తాత తన సొంత మనుషులు లేక ఒంటరి వాడయ్యాడనుకుంటే మరి నాన్నస్థితి. పైనా కిందా సోదరులుండే నాన్న ఎందుకు ఒంటరితనం అనుభవించాడు. ఇది తోబుట్టువులకు సంబంధికాదు మనిషి నిజమైన స్నేహం కోసం వెతుకులాట....

నాకెందుకో కళ్లలో నీళ్లు తిరిగాయి.

అది నాన్న స్థితో - నాస్థితో.

ఆ ఒంటరి తనంలోంచి బయట పడటం కోసం ఏదో పనిని కల్పించుకుని నిమగ్నం కావటం నాన్న చేసేవాడు. బోర్‌వెల్ వేసే విషయంలో ఆయన ప్రకృతితో పోరాడటం, పాతికెకరాలు పనికిరాదను కున్న భూమిని పెద్ద కుటుంబానికి జీవనాధారంగా మార్చాడు.

# రెండు నదుల మధ్య



భయంకరమైన ఒంటరితనంతో - సమున్నత వ్యక్తిత్వంతో నిలబడ్డ మనిషిలాగా అనేక మందికి అభ్యంతరం. తద్వారా ఏర్పడ్డ ప్రచ్ఛన్న శత్రువులు.

ఏవో కోర్టు విషయాల గురించీ, తగువుల గురించీ, సలహాకోసమో సపోర్టు కోసమో అప్పుడప్పుడు పెదనాన్న వచ్చేవాడు. ఆయన మాట తీరు ముఖకవళికలు చూస్తే ఆయనంతట ఆయన వచ్చిన వాడిలా అనిపించేది కాదు. మమ్మల్ని పలకరించటంలో మా చదువుల గురించి వివరాలు తెలుసుకోవటం గురించే అన్నట్టుండేది కాని ఆత్మీయత వుండేది కాదు.

ఈయన పాత్రదేవుంది కాని ఎప్పుడూ మా ఇంటికి రాని, మేమప్పటిదాకా కనీసం చూడని మా పెద్దమ్మకూ, మా తాతనుండి కుటుంబ స్రవంతిని అందుకున్న మా నాన్నకూ మధ్య ఏదో యుద్ధం జరుగుతున్నట్టే వుండేది. మా నాన్న వాళ్లింటికి వెళ్లినపుడు బాగా మర్యాద చేసేదట! కుటుంబాన్ని అలానడపటంలో ఆమె బాధలు నాన్నతో చెప్పుకునేదట. మొత్తం మీద ఆ యుద్ధంలో ఎకరాల రూపంలోనూ, డబ్బు రూపంలోనూ మా నాన్నను మించి ఆమే చాలా ముందుకు వెళ్లిపోయింది.

'టూమెనీ వార్ ఫ్రంట్స్ ఎట్ ఎటైమ్' (ఏకకాలంలో అనేక యుద్ధమోహరింపులు)మానాన్నకు పెదనాన్న ఫిలాసఫీ నే అనుసరించే మా పెద్దబాబాయితో అదేకాలంలో మరో యుద్ధం.

ఆస్తిరూపంలో పంపకాలు అయ్యాయి. పెద్ద బాబాయికి మంచి భూములే పోయాయి. కాని ఆయన వాటా పంచుకోలేనివి ఏవో నాన్న దగ్గర ఉండిపోయాయి. నాకు లీలగా గుర్తుంది. ఎప్పుడో ఒకసారి ఆయన నన్ను ఎత్తుకున్నట్టు, ఆయనతో నేను ఈ జీవిత కాలంలో ఎప్పుడూ మాట్లాడిన గుర్తు లేదు. ఆయన మా ఇంటి గుమ్మంలో అడుగుబెట్టిందీ లేదు, ఒక్కసారి ఆయన సరిహద్దు రైతులు ఆయన్ను కొట్టడానికి ఆలోచిస్తున్నారని తెలిసినప్పుడు మినహా.

ఒకసారి ......నాకు ఏడెనిమిదేళ్ళు వుండవచ్చు. ఆ యేడు మాకు ధాన్యం సరిగా పండినట్టు లేదు. మా పెద్ద బాబాయి అత్తగారిది కాలువ కింద ఊరు. ఆయనకు అక్కడినుండే ధాన్యం వచ్చేది. ఆయన దగ్గరనుండి ధాన్యం అప్పు తెచ్చినట్టున్నారు. బదులు తీర్చటానికెళ్ళే పాలేర్లతో నేనూ వెళ్ళాను.

బాబాయి పడక్కుర్చీలో కూర్చొని చుట్ట కాలుస్తున్నాడు. పందిట్లో రెండు బస్తాల ధాన్యం కుప్పగా పోసి పాలేరు కుంచంతో కొలుస్తున్నాడు. నేను పాలేరు పక్కనే నిలుచున్నాను. కుర్చీలోంచి లేచి ఆయన మా దగ్గరకొచ్చాడు. ధాన్యాన్ని గుప్పెట్లోకి తీసుకొని ధారగా వదులుతూ పాలేరుతో 'ఆపరీ' అని నావంక చూస్తూ 'ఎర్ర చేలో పండిన ధాన్యం పంపమని మీ నాన్నతో చెప్పరా" అన్నాడు. తిరిగి వస్తుండగా పాలేరన్నాడు "ఎర్రచేలో పండినయ్యయితే బాగా బరువు తూగుతయ్యని అయ్యియ్యమన్నారు మీ చిన్నయ్యగారు". నేను అనేక స్థితులకు లోనయ్యాను ఆక్షణం.

మొత్తంమీద మా పెద్దనాన్న పద్ధతిలోనే మా పెద్ద బాబాయి కూడా నడిచాడు. ఒక్క ఊరుమారటం మినహా. భార్యవైపునుండి మంచిదన్ను వుండటం వల్లా, ఆయనకు పగలూరేయి పొలంలో తిరిగి పండించవలసిన అవసరం లేకుండా పోయింది. మంచి భూములవటం వల్లా పచ్చగడ్డికి నీళ్లు అమ్మితేనే పంటమీదవచ్చినంతా వచ్చేది. పిల్లలు పెద్ద వాళ్లయిన తరువాత ముగ్గురు కొడుకులూ వ్యవసాయంలోనే దిగారు. మంచిబోరుపడిందట! దాదాపు యాభై ఎకరాల భూమికి నీళ్ళమ్ముతాడట! ఏ రైతుతోనూ మాటరాకుండా నీళ్లిస్తాడట. ఈ విషయాలు మా నాన్న పోయాకా వుద్యోగం వదిలి మా ఊరువచ్చి పొలాలు చూసుకుంటున్న మా రెండో బాబాయి ద్వారానే తెలుస్తాయి. మా నాన్న ఉన్నంతకాలం మా రెండో బాబాయి, ఆఖరి బాబాయి మానాన్నతోనే కలిసివుండేవారు. అప్పటివరకు వాళ్లిద్దరూ మా పెద్దనాన్నతో కానీ, మా పెద్ద బాబాయితోకాని మాట్లాడేవాళ్ళు కాదు. రెండో బాబాయి ఊరు వచ్చి స్థిరపడ్డాక మాటలు కలసి నట్టున్నాయి. ఆ సమయానికి నేను చదువుల రీత్యా ఉద్యోగ రీత్యా ఊరికి దూరం అయ్యాను. రెండో బాబాయి ద్వారానే మా పెద్దనాన్న, పెద్ద బాబాయిల విజయాల గురించి తెలిసేవి. జీవితకాలంపాటు మా నాన్నతో ఘర్షణపడ్డ మా పెద్ద బాబాయి యుద్ధరంగంలోలేని నాతో, మా తండ్రి వారసత్వం అందుకున్న నాతో, నా ఛాయతో యుద్ధం చేస్తున్నాడన్నది స్పష్టం. ఆయన ఇంట్లో జరిగిన శుభకార్యాలకు నన్నుగాని, నాయింట్లో జరిగిన వాటికి ఆయనను గాని పిలుచుకోలేదు.

నేను స్కూల్లో వున్నపుడు...స్కూలు వదిలారు. ఇంటికివస్తుంటె బస్టాప్‌లో పెద్దనాన్న కూర్చుని వున్నారు. పలకరిద్దామని అటు వెళ్ళాను. ఆయన నన్నుచూడలేదు. ఎవరితోనో మాట్లాడుతూ అంటున్నాడు. "వాడు నంది అంటె నందవుతుంది. పంది అంటె పందవుతుంది." అది మానాన్న గురించేనని నాకు కొద్దిసేపట్లోనే అర్ధమైపోయింది. అంతలోనే పెద్దబాబాయి సైకిలు దిగుతున్నాడు. పెద్దనాన్న నవ్వుమొహంతో ఏదో పలకరిస్తున్నాడాయనను. నేను తిరిగివచ్చేసాను. మనుషులు కలవటానికి అనేక కారణాలు, ఏక మనస్కత ఉమ్మరిశత్రువు వగైరా... చనిపోయేముందు నానమ్మ అందర్నీ కాదని నాన్నదగ్గరకే ఎందుకు వచ్చింది?.......

సందడి పెరగటంతో ఆలోచనల్లనుండి ఇవతలకి వచ్చాను. స్కూటర్లు మోపెడ్లమీద అయిదారుగురు వచ్చారు. రోడ్డుమీద ఇంకా కొందరు వస్తున్నట్లు కనపడుతుంది. పంచాయితీకి ఇంతక్రితం బ్యాక్‌వర్డుక్లాసుకు రిజర్వ్ అయినపుడు ప్రెసిడెంటుగా పనిచేసిన సూర్యచంద్రరావు...కొంత ఇద్దరికీ మధ్యవర్తిగానూ, మరి కొంత అవతలిపక్షం తరపున వచ్చినట్టు వాచ్చాడు.. చాలామంది రైతులతో చనువుగా మాటాడతాడు. కొందర్ని 'నువ్వు' అంటాడు. కొందర్ని 'మీరు' అంటాడు. "నాదే ఆలస్యం అయినట్టుంది. కాళిదాసుగారు ఫోన్ చేస్తానన్నారు. గంట సేపట్నుంచి చూస్తున్నాను. అందరూ చూస్తుంటార్లే అని వచ్చేసాను. సంజాయిషి చెప్పినట్టు చెప్పాడు. ఆయన ప్రస్తావించిన కాళిదాసుగారు ఇదివరకు పార్లమెంటు సభ్యునిగా చేసారు. ఏలూరు ఇండస్ట్రియల్ ఏరియాలో యూనిట్లు అవీ చాలానే వున్నాయి. వస్తుతఃభూస్వామి. బంధువర్గం జిల్లాలో ఎక్కువ.

"గవర్నమెంటు మారాక ఆయనగారికి పెద్దగా పనున్నట్టు లేదు' ' ఎత్తిపొడుపుగా అన్నాడు అచ్యుతరావు.

"గవర్నమెంటు మారడం వల్ల తేడా వచ్చేది నీలాంటి వాళ్లకుగాని పెద్దోళ్లకేం తేడావస్తది?" ఎవరో చెప్పారు.

సూర్యచంద్రరావుతో వచ్చిన వారెవరూ రైతులతో మాట్లాడలేదు.



వేపచెట్టు కింద చప్టామీద చేరారు. అంతకుక్రితం అక్కడున్న వారంతా మరోవేపుకు కదిలారు. ఆరెండు శిబిరాలను చూస్తూ...గంగాధరం నాతో అన్నాడు "ఒకప్పుడు మీ తాత కాలంలో కొందరు మాలోళ్లు మీ తాతవైపుంటె మరికొందరు మీ తాతదాయాదుల వైపుండేవారు. ఇప్పుడు రాయలసీమలో ముఠాల లాగా. కాని ఇప్పుడో...వాళ్ల మధ్య వాళ్లకు గొడవలెన్నివున్నా వాళ్ళందరొవైపు మనవాళ్ళందరూ ఒకవైపుగానూ మారలేదూ" అని నేను తలాడిస్తూ "ఏదో ఒక మారు పాలేరు, రైతుల మధ్య వచ్చిన తగువు సందర్భంలో రైతుతో నాన్న అన్నాడు- ఈ పాలేర్లు ఈ వ్యవహారమంతా ఇలాగే వుండిపోతారనీ, మనం ఇలాగే పెరిగిపోతామనీ అనుకోకు. మనతోపాటు వాళ్లూ పెరగాలని అనుకుంటారు. నీతోపాటు పెరగనిస్తే నీతో వుంటారు. లేదా వాళ్ళదారి వాళ్ళు చూసుకుంటారు" గంగాధరంతో అన్నాను.

"నిజం కదా! ఆ రైతు మొహం వాడిపోయుంటుంది." గంగాధరం అక్కడ చేరివున్న చాలామంది రైతులమొహాలు బిగుసుకుపోయాయి. వాతావరణం గంభీరంగా మారింది. చాలా ద్వేషపూరితంగా కూడా... పైన మబ్బులూ-సన్నని చినుకులూ యథావిధిగానే వున్నాయి.

"ఇంతకీ నువ్వు వాళ్ళతరపున వచ్చావా? పెద్దమనిషిగా వచ్చావా' అడిగాడు నరసింహారావు.

"నేను వకాల్తా పుచ్చుకొస్తానా? నా సంగతెరుగరామీరు. గొడవ అవుతుందంటె సర్దుబాటు చేద్దామనేగదా నేనొచ్చింది." తన నవ్వుని చెదరనీయకుండా చెప్పాడు సూర్యచంద్రరావు.

"నువ్వు మధ్యవర్తివంటె ఎవడు నమ్ముతాడు? అల్లుమీరు ఒక్కటి కాదూ" ఎవరో సన్నగా గొణిగారు. అది సూర్యచంద్రానికి వినపడినట్టు లేదు. వినపడినా పట్టించుకునేవాడు కాదు.

మామూలు మాటలు పూర్తయి విషయంలోకి వచ్చేసరికి అరగంట పట్టింది. ఈలోపులో మా ఇంటివద్ద నుండి మరోసారి అమ్మకబురు పంపింది. అందరితో బాటు భోజనానికి వెళ్లినట్టు వెళ్లెబాగోదు. కాస్తాముందెళ్లి వాళ్లని పలకరించిరమ్మని. చెరువుదగ్గర కర్మకాండ ముగిసి ఏ నిముషాన్నయినా వాళ్లు రావచ్చునట! ఎవరో చెరువు వైపునుంచి వచ్చినాయన చెబుతున్నాడు..

రచ్చబండ వద్దమాటలు జోరందుకున్నాయి.

పద్ధతులు మార్చుకొమ్మనీ, కుర్రాళ్లకు చెప్పుకోమని వీళ్లంటూరు. అంతకట్టుతప్పి ఎవరూ నడవట్లేదని వాళ్లు. ఎవరో మాలతను దూరంగా నిలబడి ఎప్పుడెప్పుడు ఎవరెవరు కట్టు తప్పారో వరుసబెట్టి చదువు కొస్తున్నాడు. మరెవరో ఆయన్ను వారిస్తున్నారు. ఒకోసారి మనిషికోమాట మాటాడుతున్నారు. ఎవరు ఏమి మాట్లాడుతున్నారో తెలియని స్థితి. రకరకాల నిష్ఠూరాలు. బెదిరింపులు. రచ్చబండ మీద నుంచి సూర్య చంద్రరావు శాంతివచనాలు... ఇది కులాల మధ్య గొడవో-అధికారాలు లేదా అన్నీ కలగల్సిన చిత్రమైనగొడవో? నాకు ఎంతత్వరగా అక్కన్నుంచి బయటపడదామా అన్పిస్తుంది. అటూ ఇటూ కాకుండా వానజల్లులు. జి.యం.టి రోడ్డు మీద లారీలు ట్రాక్టర్లు. ఆ వేశకావేశాలతో అరుస్తూ చేతులూపుకుంటూ ఉభయపక్షాలు. దినం దగ్గర జనాలతో మాట్లాడటానికి యిప్పట్నుంచే సన్నద్ధం కావటంతో మనస్సులో బరువు....చాలా అనీజిగా వుంది వాతావరణం నా స్థితిలాగే పలుకరించిన వారికి అన్యమనస్కంగా సమాధానమిస్తున్నా. అధిక భాగం ప్రశ్నలు నా జీతంగురించే. నా జీవితం అక్కడెలా వుందని అడిగేవాళ్లు తక్కువ. నా జీతం నా జీవితం గురించి చెబుతుందేమో వాళ్లకు.

మొత్తం మీద ఎవరోవచ్చి చెప్పారు. చెరువుదగ్గర్నుంచి తిరిగివచ్చారని. నేనింకా ఆగదల్చుకోలేదు.

గంగాధరంతో కలిసి పెద్దమ్మవాల్లింటి వేపు బయలుదేరాను. "వాళ్లంతా కాసేపటికి అక్కడికే చేరతారు. కాసేపటికే వీళ్లందరికీ అర్థమవుతుంది. తగువుకంటె భోజనం ముఖ్యమని." నడుస్తూ అన్నాడు గంగాధరం. "ఇలా మాట్లాడుతావు కాబట్టే నువ్వంటె వాళ్ళకు కోపం రా" అన్నాను నవ్వుతూ.

" అప్పసాని మురళి గాడు ఏలూర్లో బాగా తాగి అంటున్నాడట తలుచుకుంటె కారంచేడూ చుండూరూ చేసేస్తానని." అదీమన వాళ్ల తెలివి. యుద్ధమంటె అవుతలివాళ్లే నష్టపోతారని అనుకుంటున్నాడు. వెధవ మక్కెలు మిగులుతాయా! అని."

గంగాధరం మరేయేమో చెబుతూనేవున్నాడు.

ఇంతలోనే మా పెద్దమ్మ ఇల్లు వచ్చింది. ముప్పయ్ సెంట్ల స్థలంలో ఇల్లు పెద్దగానే కట్టారు. ట్రాక్టరు పోవడానికి రావడానికి సరిపడినంతా గేటు. షామియానా పట్టినచోటల్లా వేసారు. జల్లులకు షామియానాలు కాస్తా తడిసాయికాని ఉరవడం లేదు. ఇంటిముందు సిమెంట్ రేకులతో పందిరి వేసివుంది. ఇంటి వరండాలో దినానికి సంబంధించిన కార్యక్రమం నడుస్తుంది. పురోహితుడు గట్టిగా మంత్రాలు చదువుతున్నాడు. పెద్ద ఆశతోనేవున్నట్టున్నాడు. చాలామంది బంధువులు కుర్చీలమీద కూర్చుని కబుర్లాడుకుంటున్నారు. మా నాయనమ్మ తరపున మా యింటి పేరిట వాళ్లూ బంధువర్గం దేశం నలుచెరుగులా వున్నారు. చాలా భాగం మొహాలు కనబడుతున్నాయి. పెరటివైపు నాకు బొత్తిగా పరిచయం లేదు. కలపుగోలుగా తిరిగే చొరవ అక్కడ నాకు లేదు.

దొడ్డివైపు గుమ్మంలోంచి గాడిపొయ్యిలు కనిపిస్తున్నాయి. ఒక పొయ్యిమీదినుంచి పెద్ద అన్నం అండాని ఇద్దరు మనుషులు దించి గంజివారుస్తున్నారు. మరొకాయన పొడవాటి తెడ్డుతో సాంబారు గాబోలు కలియబెడుతున్నాడు. చిన్నప్పట్నుంచీ నేను ఎరుగున్నమరో ముగ్గురు నలుగురు పనివాళ్లు. మా పెద్దమ్మ సోదరికావచ్చు, ఒకావిడ ఆ పనిమనుషులను ఆజమాయిషీ చేస్తోంది. మా పెద్దవదిన మినహా మిగతావాళ్లెవరూ నాకు తెలియదు. ఎవరెవరో చాలామంది ఆడాళ్లు అటూ ఇటూ తిరుగుతున్నారు. కొందరు కుర్చీలు బల్లలు సర్దుతున్నారు. ఉండుండి ఎవరో ఎవరినో గట్టిగా పిలుస్తున్నారు. నేను నిలబడి మా పెద్ద నాన్నకోసం చూసాను. గోడవారగా వున్న షెడ్‌లో ట్రాక్టరు పక్కగా చేతులు దవడకానించుకుని మా పెద్దనాన్న దీర్ఘంగా ఆలోచిస్తున్నాడు. సన్నటి శరీరం దవడలు, కళ్లూ పీక్కుపోయి వున్నాయి. అటువైపు నడిచాను. నలభైపుట్లు వరకు వుండే పొగాకు 'మండి' నుండి ఘాటువాసన వస్తున్నది. నేను రావటం చూసి ఒక కుర్చీని పక్కకు లాగాడు. "పొద్దున్నవచ్చావా? కోడలొచ్చిందా?" అడిగాడు. సమాధానం చెప్పాను. కొద్దిసేపు మౌనం. మా మేనత్తమొగుడూ,, మా రెండో బాబాయి మేమున్నదగ్గరకు వచ్చారు. కుర్చీల శబ్దం...."రాజులేని



రాజ్యంలా అయిపోయింది" ప్రక్కనే వున్న ధాన్యం పురివంకా పొగాకు మండీవంకా చూసుకుంటూ మా మేనత్తమొగుడు కొద్ది సేపటితరువాత అన్నాడు. నాకెందుకో మా పెద్దనాన్న ముఖం చూడాలనిపించింది.

"పెళ్ళికి రావాల్సిన వాళ్ల ఈ విధంగా వచ్చారు" మా పెద్దనాన్న బావ మరిది సిగరెటు వెలిగించుకుంటూ అన్నాడు. అతను దగ్గర్లోనే ఓ ఊరికి ప్రసిడెంటుగా చేసారు. మోతుబరి రైతు. కూతురికి అమెరికా సంబంధం చూస్తున్నాడట. కొడుకులకు చదువబ్బలేదు. ఒకడు ఫైనాన్స్, రియల్ ఎస్టేటు బిజినెస్సు ఏలూర్లో చేస్తున్నాడు. రెండో వాడు ఊళ్లోనే తోటలూ రాజకీయాలు చూసుకుంటున్నాడు.

"ఏదైనాగాని వదిన తొందరపడింది" మా పెద్దనాన్నకి తమ్ముడు వరసయ్యే ఒకాయన అన్నాడు. దానికి కొనసాగింపుగా "ఇంతా చేసి ఒక పొజిషన్లోకి కుటుంబాన్ని తీసుకొచ్చి అదంతా అనుభవించకుండా చివరికిలా కావడం ..." సాగదీసాడింకో బంధువు.

వాళ్ల అభివృద్ధి, ఆవిడ ముగింపూ వేరువేరు కాదనిపించిందినాకు.

మా పెద్దమ్మ మాటల్ని చాలా పొదుపుగా వాడేది. నేను మా చెల్లి పెళ్లప్పుడు శుభలేఖ ఇవ్వటాన్కి వాళ్లింటికి వెళ్లాను. ప్లేటునిండా సపోటాలు, బత్తాయితొనలూ పెట్టి అడిగింది. "ఏమిచ్చి చేస్తున్నావు చెల్లెలు పెళ్లి" అని. "నేను సంపాదించిందేవుంది ఇవ్వటాన్కి. పై వాళ్లిచ్చిందాట్లోంచి కొంత యిస్తున్నాం" అన్నాను. "మరి నువ్వెంతలో వున్నావు" రెండోమాట అడిగింది. నేను నవ్వి ఊరుకున్నాను. జీవిత కాలంలో నాతో ఆవిడ మాట్లాడినవి ఆ రెండు మాటలే.!

పెద్దనాన్న రెండో కొడుకు బావమరిదట! అమెరికాలో చాలా కాలం వుండి ఈ మధ్యే వచ్చాడట. ఎవరో నాకు పరిచయం చేశారు. ఆయనతోపాటే మరికొందరు బంధువులు. చూస్తుండగానే జనసందోహం పెరిగింది. రచ్చబండ దగ్గిర వున్న చాలామంది గందరగోళంగా మాట్లాడుకుంటూ షామియానాలకిందకి చేరారు.

"ఫలానా వారిల్లు ఎక్కడా అని అడిగితె ఇద్దరు ముగ్గురు మాకు తెలియదు అన్నారు. చూట్టానికి ఈ వూరి వాళ్లలానే వున్నారు. ఇల్లు చెప్పటానికి కూడా భాగ్యవా. " ఎవరో లావుపాటావిడ ఆయాసపడ్తూ చెప్పింది. అందరిపట్లా నాకు ఆసక్తి వున్నట్లూ, అందరికీ నాపట్లా ఆసక్తి వున్నట్లుంది. 'రామచంద్రంగారబ్బాయి చక్రం అనేవాళ్లం చిన్నప్పుడు. హైద్రాబాద్ అవతల తెలంగాణా లో మంచి ఉద్యోగం చేస్తున్నాడట.' నన్ను చూపిస్తూ చెబుతున్నారు.

భోజనాలకు లేవచ్చని ఎవరో పెద్దగా చెప్పారు. చాలా మంది బిలబిలలాడుతూ కుర్చీలవైపు కదిలారు. నేను తరువాత కూర్చోవచ్చని గంగాధరం కోసం చూస్తుండగానే" చక్రధరాన్ని ఇటుపంపండి "

ముఖద్వారం ప్రక్కగా నిలబడి పెద్దవదిన మా దగ్గిరే వున్న పెద్దన్నయ్యను ఉద్దేశించి అంది. "అటంట వెళ్లరా" అని అన్నయ్య అన్నాడు. అటుకదిలాను.

"ఏంమరిదిగారూ! మీ ఇంట్లోకి కూడా మేమే పిలవాలా? మీ వదినల్ని యింటినీ చూద్దువుగాని రా! " అని రెండు సెకన్లాగి "మేం మాత్రం ఈ ఇంట్లో స్వతంత్రంగా తిరిగిందెపుడులే" అంది. గదులన్నీ తిప్పుకుంటూ, చుట్టాల్లోంచి దారి చేసుకుంటూ మధ్యమధ్యలో "మా మరిది, మా పినమాంగారికొడుకు' అని పరిచయాలు చేసుకుంటూ పెరట్లోకి తీసుకువెళ్లింది. అక్కడ జనసమ్మర్థం పెద్దగా లేదు. కొద్దిగా ప్రక్కకు వంటల హడావిడి నడుస్తోంది. వెజిటబుల్ బిర్యానీని బంతిలోకి తీసుకెల్తున్నారు. వేడి వేడి ఆవిర్లా సువాసనలు పెద్ద మూకుట్లో బజ్జీలు అప్పడాలు మసిరే నూనెలో వేగుతున్నాయి. రెండు బజ్జీలు ప్లేట్లో వేసుకువచ్చి తినమని నా చేతికిచ్చి, తోడికోడళ్లని పిలుచుకువస్తానని లోపలికివెళ్లింది.

అప్పుడపుడు వర్షపు చినుకులు మూకుట్లోపడి 'సుయ్ సుయ్' మంటూ శబ్దం చేస్తున్నాయి.

ఇద్దరు పనికివచ్చిన ఆడవాళ్లు వర్షన గరిటెలూ గిన్నెలూ కడుగుతున్నారు. ఇంతలో పదిహేను సంవత్సరాల అమ్మాయి ఒంటినిండా నగలతో ఇంట్లోనుండి అటువచ్చింది. ఒకసారి నావంక చూసి లోపలికి వెళ్లిపోయింది. "ఈపాపనే ఇంట్లో ఆఖరు అబ్బాయికిచ్చి చేద్దామనుకున్నారట. అక్కకూతురే! మేనకోడలు వరుసన చేద్దామనుకున్నారు. ఈ పెళ్లివల్లే ఇంట్లో గొడవలు . వయసు తేడా ఎక్కువైందని. ఆ అబ్బాయి కేమో అప్పుడే నడీడు. ఈ అమ్మాయిని చూస్తె ఇంకా బొడ్డూడని పాప...అస్తులు బైటకి పోగూడదని...ఈ పెద్దింటోళ్లంతా ఇంతే!" ఇద్దరు పని కత్తెల్లో ఒకామె మరొకామెతో నెమ్మదిగా అంటోంది. ఈ హడావిడితో ఏమీ సంబంధం లేనట్టుగా.

"ఏం మడుసులో! ఎప్పుడు డబ్బు గొడువలే కాని మనసుల్ని పట్టించుకుంటారా? ఈ పిల్ల గొంతు కొయ్యనియ్యలేదని, ఆయమ్మ తనే గొంతు కోసుకుంది" రెండో ఆమె.

అదొక్కటేనా? పెద్దోళ్లకు పెద్ద పెద్ద గొడువలు చానా వుంటాయి లేమ్మా" మొదటామె.

మొదటి బంతి లేచినట్టుంది. లేచిన వాళ్ళు షామియానాలకిందికీ, షామియానాలకింది వాళ్లు లోపలి కుర్చీలమీదకి మారుతున్నారు. వదినతో 'కలుస్తానని' చెప్పి ఇంటిముందుకువచ్చాను.

గంగాధరం నాకోసం చూస్తున్నాడు. ఇద్దరం కల్సి బంతిలో కూర్చున్న చాలామంది చాలారకాల విషయాల గురించి చర్చించుకుంటున్నారు. సాధారణంగా కన్పించే చావుకు సంబంధించిన విషాదమేమీ కన్పించడంలేదు. చావును చాలా సహజ విషయంగా తీసుకుంటున్నారా? లేక ఆ తీవ్రత నుంచి తప్పించుకోవడానికి అట్లా మాట్లాడ్తూ కన్పిస్తున్నారు. " ఆ మాటలేవీ లోపలి నుండి వస్తున్నట్టు లేవు. ఎవరో గట్టిగా అరుస్తున్నారు. "పామాయిల్ తోటలు పెట్టడమంటె జీడి తోటలు, కొబ్బరి తోటలు పెట్టినట్టు కాదు. బోల్డంత పోషణచేయాలి. రోజూ పట్టించుకోవాలి. లేకపోతే దిగుబడిరాదు."

"మిల్లు దరిదాపుల్లో వుందా? ఎక్కడో తమ్మిలేటి ఒడ్డున వుంది. ఇప్పుడంటె తోటలన్ని పూర్తిగా పెరగలేదు కాబట్టి తెలియట్లేదు. తోటలన్నీ సరిగ్గా దిగుబడి మొదలైతే మిల్లు యార్డులో ఎదురుచూడాల్సిందే" ఒక పెద్దాయన అన్నాడు.

"ఇయ్యన్నీ లెక్కేసుకోకుండా మిల్లులు పెడతారా?" కొద్దిగా కోపంగానే ఓ కుర్రాడన్నాడు.

"వాళ్లు లెక్కలన్నీ వేసుకునే పెడ్తార్లే. నాలుగేళ్లు ఆగితే తెలుస్తుంది ఆ లెక్కల మతలబు." మరొకాయన.



"ఏంటయ్యా ఈ ఊకదంపుడు మాటలు వచ్చింది పెళ్లికా కర్మకా' ' ఒకాయన అసహనంగా

ఎవరో గట్టిగా "అన్నం ఇటుతీసుకురండి" అంటున్నారు.

మరొకాయన "పెరుగుచట్నీ, పెరుగుచట్నీ" అంటున్నాడు. "వచ్చె వచ్చె"నంటూ వడ్డించేవాళ్లు టేబుల్ల చుట్టూ తిరుగుతున్నారు.

అమెరికా అయన ఏదో చెప్తున్నాడు. "అక్కడ సంపాదించిన సొమ్మును యిక్కడకు తీసుకువస్తేనే విలువ. ఇక్కడ రూపాయికి వచ్చేవే అక్కడ డాలరుకు వస్తాయి. డాలరు ఇక్కడికి తెచ్చి మారిస్తేనే ముప్పయి రూపాయల విలువ!" వీళ్లకు అర్థమయ్యేలా చెప్పటం కోసం ఆయన నానా తిప్పలు పడుతున్నాడు.

"ఏమైనాగాని సంపాదించాలంటె ఎక్కడికయినా వెళ్లగలగాలి. సూర్యనారాయణ గార్ని(మా పెద్దనాన్న) చూడండి. అప్పుడు ధైర్యం చేసి ఊరుమారబట్టే కదా ఇంత సంపద చూడగలిగింది. రామచంద్రం (మానాన్న) ఊళ్లోనే వున్నాడు. చెయ్యటాన్కి యెవసాయం పెద్దగానే చేశారు, ఏం లాభం. ఏం వెనకేసారు ? పిల్లలకు చదువులు మాత్రం వచ్చినయిలే" అని కాసేపాగి "తుంగభద్ర వైపు వెళ్లినోళ్ల పని బానే వుందట. మంచి భూములు. కావాల్సినంత నీరు. నాగపూరు వార్ధల మధ్య చేరినోళ్లమనవాళ్ల పరిస్థితి కూడా బాగానే వుందట. మా తోడల్లుడి బామ్మర్ది అక్కడ యాభైయెకరాలు కొని వ్యవసాయం చేస్తూ ఉన్నాడు' ' మానాన్న వెనకెయ్యకపోవటానికీ. ఊరుమారకపోవటమే కారణ మన్నట్టు చెప్పుకొచ్చి ఏమంటావన్నట్లు మారెండో బాబాయి వంక చూశాడు టిక్కన సోమసుందరం.

ముప్పయ్యేళ్లు వచ్చినా చెల్లెలి పెళ్లి చేయకుండా వుంచి. ఆమె ఎవర్నో సొంతంగా చేసుకుంటె నానా గొడవలు చేసి. ఆమెకు ఆస్తిలో ఏమీ దక్కకుండా చేయగలిగాడు సోమసుందరం. "కులంగానోన్ని చేసుకుంది మంచి సంబంధం కోసం ఎన్నో ప్రయత్నాలు చేసాను. దానికి రాతుండొద్దు" అని ఆమె ప్రస్తావన వస్తే వెళ్లబోసుకుంటాడు.

ఆయన మాటలకు 'అవునుమరి అంతేకదా" నెమ్మదిగా అంటూ ఒప్పుకోలుగా తలూపాడు మా బాబాయి.

"అవాల ముద్దలా సాగుకు అనువుగా తయారు చేసిన బూములూ తోటలూ పంచుకునేప్పుడు - అదీ ఒకళ్ల చెవటోడిస్తేనే అలా తయార య్యాయని అనిపించలేదా" వినీ వినపడనట్టు అన్నాడు వెంకటేశు. మాతాతవున్నప్పట్నుంచి మా కుటుంబాన్ని ఎరిగినవాడు. కమతంలో కొన్నేళ్లు పనిచేసినవాడు.

నాన్న పోయాకా నాకూ మా ఇద్దరు బాబాయిలకూ పంపకాలు జరిగినప్పటి సంఘటనలు నాకు హఠాత్తుగా గుర్తుకు వచ్చాయి. నా పెళ్లి చెల్లి పెళ్లి అయ్యేవరకూ ఉమ్మట్లోనే కమతం వుంచమని అమ్మ. నాన్న వాళ్లకు చేసిందానికి ఈ మాత్రం వాళ్లు చేయాలని అమ్మ ఆశ. వాళ్లంతట వాళ్లు చేస్తే ఫర్లేదుకాని దానికోసం గట్టిగా అడగటంలో నీకు కొంత అభ్యంతరముంది. బహుశా ఆ ఉమ్మడి సంపదలో అమ్మా రెక్కల కష్టం కలగల్సి ఉండటం వల్లనే మొ అమ్మ అట్లా అంటున్నది.

"ఇప్పటి వరకూ కలిసి వుండటమే మేము చేయాల్సిం దానికన్నా ఎక్కువని'' రెండోబాబాయి వాదన. ఆఖరి బాబాయి తరపున కూడా రెండో బాబాయే మాట్లాడాడు. తర్జన భర్జనలయ్యాయి. " యేం ఇప్పటి దాకా కలిసి వుండకపోతే మీరంతా చదవగలిగేవారా" బాబాయి ప్రశ్న,

"ఈ మాత్రం చదువు నాలుగెకరాలున్న రైతులు కూడాపిల్లలకు చెప్పించుకున్నారు." అక్క సమాధానం చెప్పింది.

మరో మాట మీద అక్కే అంది. "మానాన్న మీ పెద్దన్నయ్య కన్నా తెలివైన వాడని చాలాసార్లు నువ్వే అన్నావు. మా నాన్న పెళ్లి కాగానే వేరే వెళ్లిపోతే పెద్దనాన్నలాగా నాన్న కూడా సంపాదించలేక పోయేవాడా ఏ యాభయ్యెకరాలో అపైనో" దానికి అయనేవీ సమాధానం చెప్పినట్టు లేదు.

బంతిలోకి రకరకాల భోజన పదార్థాలు బేసిన్లలోనూ బకెట్లలోనూ వస్తున్నాయి. చేతులూ మూతులూ దండిగానే కదుల్తున్నాయి. రుచుల గురించీ శుచుల గురించీ ఒకవైపు చర్చలు చేసుకుంటున్నారు. తుఫాన్ గురించీ. దాని ప్రభావాల గురించీ మాటలు వస్తున్నాయి. పాత తరం రైతొకాయన అన్నాడు "నాలుగొందలు, ఐదొందలు అడుగులు ఎళ్ళి నీళ్ళు పైకి తెస్తున్నాం. ముందు ముందు ఏవౌద్దో ? అటూ, ఇటూ కృష్ణాగోదావర్లున్నా ఊరికి నీళ్ళకరువే ! పోలవరం ప్రాజెక్టు నీళ్ళు ఎప్పటికి రావాలి ? నా చిన్నప్పట్నుంచీ యింటున్నానీ మాట.

నీళ్ళెతుక్కుంటూ జనాలు ఎటెటో వెళ్ళిపోతున్నారు "

"పాతికేళ్ళనాడు తుంగభద్ర వెళ్ళినోళ్ల సంగతేవయింది ? అంతా సంపాదించామనుకున్నాకా చివరికి కట్టుబట్టల్తో వెనక్కొచ్చారు. చెరుకు వాడలో మాబంధువులప్పుడేగా తిరిగొచ్చింది. అన్నాడొకాయన. పైనచెప్పి నాయన కొనసాగింపుగా.

"ఇప్పటి సంగతి వేరులే ! మనోళ్లు ఊళ్లకు ఊళ్లేకట్టుకున్నారు." వేరొకరి సమాధానం.

అక్కడిదాకా వస్తే ఊర్లేం ఖర్మ కోటలు కట్టుకున్నా ఆగవు ఒకచోట సొమ్ము కూడబడుతుంటె ఎవడూరుకుంటాడు. ఆరేళ్లనాడు విజయవాడలో ఏమైంది. ఎందుకు దోచారు ? ఎందుకు తగలబెట్టారు ? ఆ బీభత్సం వెనుక ఎన్నేళ్లుగా పేరుకున్న కసి ద్వేషముంది ? అది ఒకనాటిదా లేదా ఏఒక్కరిమీదో అభిమానంతో జరిగిందా ?" ఏలూరు ప్రక్కన ఓ ఊరు నుంచి వచ్చిన బంధువొకాయన అన్నాడు. అయన వరుసకు మాకు మామ అవుతాడు.

"అఁ .....దోచుకెళ్లేఏమైపోతుంది. ఏదోచిన్న చిన్న వాళ్లు దెబ్బతిన్నారు గాని చాలామటుకు ఇన్సూరెన్స్ డబ్బు గానే అందుకున్నారు. కాలిపోయిన డొక్కు థియేటర్ల ప్లేసుల్లోనే నాలుగేసి అంతస్తుల షాపింగ్ సెంటర్లూ థియేటర్లూ వచ్చాయి." చెప్పాడు బొప్పన వెంకటేశ్వర్రావు. కమిషన్ వ్యాపారం. బానే సంపాదించాడు. మధ్యప్రదేశ్ లో ఎక్కడో చవగ్గా భూములున్నాయట. వందెకరాల దాకాకొందామని ఆలోచిస్తున్నాడట.

"విజయవాడలో విధ్వంసమైనా - లాస్ ఏంజిల్స్‌లో లాసుల మీద లాస్‌లొచ్చి మనాళ్లు తగలబడ్డా ఒకటొక్కటిగా జరిగి నపుడు ఏంకాదు. ఇన్సూరెన్సులు అయ్యా బానే వస్తాయి. ఇలాంటివే వైనా ఆర్గనైజుడ్‌గా ఒకేసారి జరిగితే ఏమౌద్ది ? మొత్తం తలక్రిందులౌద్ది.'' హఠాత్తుగా ఈ మాటలు వినబడ్డ వైపు చూసాను. మా బంధువర్గంలోని కుర్రాడే. పేరు మోహన్‌రావు. మాకు నాలుగైదేళ్లు జూనియర్. హైద్రాబాద్ జీడిమెట్లలో ఏదో ఇండస్ట్రీలో పని చేస్తున్నాడట !



అమెరికానుండి వచ్చిన బంధువుని కూడా ఈ మాటకదిల్చి .నట్టుంది. ఎవరూ ఏమీ మాటాడటంలేదు. ఎవరైనా ఆ కుర్రాడి మాటల్ని కొట్టిపారేస్తే బాగుండునని అందరి మనస్సులలోనూ వున్నట్టుంది.

బంతిలో పెరుగు వడ్డిస్తున్నారు. బకెట్లలో గరిటల శబ్దాలు. చేతులు కడుక్కోవడానికి లేచేవాళ్లు కూడా చర్చపట్ల ఆసక్తిగా అలాగే కూర్చుండిపోయారు.

'విజయవాడ అల్లర్లు ఒక కులం మీద ఇంకో కులం వాళ్లకున్న కోపంవల్ల కాదు. వీటికీ కులానికి సంబంధం లేదంటున్నారు సరే బానే వుంది. మనుషులు కలువటానికీ, కొట్టుకోవటానికీ కులం ప్రభావం లేదన్నమాట. అలాగైతే అమెరికా వెళ్ళిన మనవాళ్లలో కూడా కులసంఘాలున్నాయంటున్నారు" కొంత సమయమనంతోనే అడిగాడు తాతిని రాజారావు. ఓల్డ్ ఎస్సెల్సీ చదివాడు. వ్యవసాయం చేస్తున్నాడు. నేనడిగినపుడు పుస్తకాలెప్పుడూ కాదనకుండా ఇచ్చేవాడు.

దీనికి సమాధానం చెప్పాల్సిన అమెరికా బంధువు వంక అందరూ చూశారు. " అమెరికా వెళ్లి సెటిలయిన వాళ్లందరిదృక్పథం హఠాత్తుగా ఏమీ మారట్లేదు. ఇక్కడివారికి భిన్నంగా కూడా వాళ్లేమీ లేరు. మైనార్టీగా వున్నప్పుడు కుల సమస్యలేవీ ఉండేవి కావనుకుంటగానీ ఎక్కువ సంఖ్యలో అక్కడ తెలుగువాళ్లు చేరాకా. ఇక్కడిలానే కుల స్పృహ వచ్చింది. ఇక్కడి రాజకీయ వాతావరణం కూడా అక్కడ ప్రభావం చూపెడుతుంది.

కల్చర్ విషయంలోనూ, కలర్ డిస్క్రిమినేషన్‌వల్లా ఎంతో కొంత అభద్రతా భావం కలుగుతూనే వుంటుంది. నిజాయితీతోనే చెప్పాడన్పించింది. ఆయనేదో ఇక్కడ ఇండస్ట్రీలోపెట్టుబడి పెట్టాలని అనుకొంటున్నాడని విన్నాను. నిజమే కావచ్చు.

చాలా మంది బంతిలోంచి లేచారు. చేతులు కడిగి షామియానా కిందికి పోయి కూర్చున్నారు. లోపల టేబుళ్లు శుభ్రం చేస్తున్నారు. బయట జల్లులు బాగా పలుచబడి సన్నసన్నగా చినుకులు రాలుతున్నాయి. నేలంతా చిత్తడి చిత్తడిగా మారింది. కుక్కలెక్కడోవిస్తళ్ల దగ్గరకాబోలు కాట్లాడుకుంటున్నాయి.

కులం గురించి అమెరికా ఆయన ఇచ్చిన వివరణ ఒకాయనకు నచ్చినట్లు లేదు.

'అలాగంటే మరి హైద్రాబాద్‌లో మనవాళ్ల కంపెనీల్లో మన కుర్రాళ్లకే ఉద్యోగాలిస్తున్నారు గదా ! అలా ఉద్యోగం సంపాదించటం కులం పేరుతో మేలు పొందటం కాదా ?" అన్నాడు.

"ఎవడి పద్ధతుల్లో వాడు ఆర్గనైజు చేసుకుంటాడుకదా ! కులం పేరుతో ఒకడు, మతం పేరుతో ఒకడు. కాని చేయించుకునే కష్టానికీ, ఇచ్చే ప్రతిఫలానికీ పొంతన కుదురుతుందా అని " మోహన్‌రావే అన్నాడు.

"నువ్వేన్నైనా చెప్పు ! మన కులం వాడని పిలిచి ఉద్యోగమిచ్చిన వాణ్ణి నానాయాగీ చెయ్యడం మంచిది కాదు " అన్నాడు ఆయనే తిరిగి.

"కష్టం చేసి ఫలితం అడగటం నేరం కాదుకదా ? దీనికి కులానికి సంబంధం ఏమిటి ? పనిచేయటానికి మన కులం కాకపోయినా మరోడెవడో కావాలి కదా !" మోహన్రావు.

మొదట్నుంచీ మోహన్రావు ధోరణిని గమనిస్తున్న మురికిపూరి ప్రకాశరావుకి ఈ మాటలు రుచించినట్టు లేవు. కళ్లజోడు తీసి బుజంమీది జరీకండువాతో తుడుస్తూ - పెదవి విరుస్తూ అన్నాడు.

"తర్కాలు ఎన్నైనా చెప్పవచ్చు. డిగ్రీలు చదివి ఖాళీగవున్నోళ్లు ఎందరు లేరు. ఊర్లో పండితే ఊకైనా దొరుకుద్దన్నట్టు ఏదో వాళ్లకి ఉండబట్టి చిన్నదో పెద్దదో ఉద్యోగం ఇవ్వబట్టే కదా వీళ్ల బ్రతుకు వీళ్లు బ్రతుకుతుంది. చేరదీసిన వాన్ని అనటం ఎంతవరకు సమంజసం ?'

పదిహేనేళ్ల క్రితం చెల్లెలి భర్త చనిపోతె వాళ్ల స్థితి బాగా లేదని కనీసం బరువన్నా తగ్గుద్దని ఒక మేనల్లుడిని ఇంటికి తెచ్చుకున్నాడు ప్రకాశరావు. వాడిదీ ఆయన కొడుకుల వయసే ! కొడుకు లిద్దరూ మంచి పొజిషన్లోకి వచ్చారు. మొదటికొడుకు ఏదో ప్రభుత్వసంస్థలో ఆఫీసరు. రెండోవాడు అమెరికా పోయే ప్రయత్నాల్లో వున్నాడు. ఈయన రాజకీయాల్లో తిరిగినా వ్యవసాయం చేయడానికి మేనల్లుడుండటం వల్ల బానే కలిసి వచ్చింది. చివరకు మేనల్లుడికి బంజరు భూమి ఓ మూడెకరాలు ఆపుచేయించి పట్టా సంపాయించాడు. ఈ మధ్యే కూతురు పెళ్లి చేసాడు. మేనల్లుడి పెళ్లికూడా చేయాలనుకుంటున్నానని అంటూంటాడు.

కులం చర్చతేలేది కాదని ఒకాయన జనాంతికంగా "బతుకు తెరువు లేక వెళితె ఏమోగాని, సంపాదిద్దామని ఒకచోటునుంచి మరోచోటుకు వెళ్లి అక్కడ కూడేసిన తర్వాత దానిని కాపాడుకోవటానికి చాలా కష్టమేపడాలి." అన్నాడు.

"సొంత ఊర్లోనైతె డబ్బుపోగేస్తే ఏమీ కాదంటావా" యలమాటి సుబ్బారావు అడిగాడు. కష్టపడి పనిచేసినా చితికిపోయిన సన్నకారు రైతు.

"అందాల్సిన వాళ్లందరికీ అందకుండా ఒకచోటునే డబ్బు చేరుతుంటే ఎవరు చూస్తూఉరుకోరు. భూమి అమ్మేవాడు ఏస్థితిలో వుండి అమ్ముతాడో మనకు తెలిందేవుంది ?" తండ్రి కాలంలో చితికిపోయిన కమతాన్ని చూసాడో, తను పనిచేసే యిండస్ట్రీలో కాపిటల్ ఎక్యుమలేషన్ చూసాడో సూటిగా చెప్పాడు మోహన్‌రావు !

పరిచయమైన మాటల్లో తమ ఆలోచనలకు అనుకూలంగా లేనివిధంగా చెబుతున్న అతని మాటలు వాళ్లందర్నీ కాసేపు మాటాడకుండా చేసాయి. గత కొద్ది కాలంగా బాగుపడుతున్నామను కొంటున్న అచ్యుతరావు లాంటి ఊళ్లోవ్యక్తులు, ఊరుకాని ఊరు వెళ్లి పొలాలు సంపాదించి ఆసంపాదనా క్రమంలో అనేక యుద్ధాలు చేసి నెగ్గామో ఓడామో తెలియనిస్థితిలో వున్న పెద్ద నాన్ననీ, తుంగభద్రో వార్ధానో మధ్యప్రదేశో వెళ్లి భూముల్ని వ్యాపార వస్తువుగా కొనుగోలు చేద్దామనుకునే వాళ్లనీ, పెరిగిన మూలధనాన్ని షాపింగ్ కాంప్లెక్సులుగా థియేటర్లుగా మార్చే ఉద్దేశంతో వున్నవాళ్లనీ, పరిస్థితిని అర్థం చేసుకుని కూడబెట్టిన ధనాన్ని స్వంత చోటుకు చేర్చుకోవాలని ఆలోచిస్తున్న అమెరికా బంధువుని, కులం రూపంలో ఐక్యత సాధిద్దామని చూసే వాళ్లని.....అక్కడ కూర్చున్న అందర్నీ ఏదో ఒక విధంగా లోనికి ఆలోచించే విధంగా చేసాయి మోహన్‌రావుమాటలు.



తుఫాన్ ఇంకా తీరం దాటలేదనీ, వాతావరణసూచన చెబుతున్నారు. ఈదురు గాలి గట్టిగానే వీస్తోంది. భోజనాలు ముందే ముగించినవాళ్లు బయలుదేరి గేటు బయట నిలుచున్నారు.ఎవరో ఎవర్నో రమ్మని పిలుస్తున్నారు. ఆలోచనల్లో మునిగిన వారు వాళ్లని అనుసరించారు. భోంచేసివస్తున్న నాక్లాస్‌మేట్ రమణ కలిసాడు. అతన్ని సాగనంపటానికి బయటకునడిచాను.

చాలా మంది వీధిలోనికి నడుస్తున్నారు. ఉన్నట్టుండి పెద్దగా అరుపులు వీధిలో నడుస్తున్న గుంపులోంచి, పాంటు షర్టులలో వున్న ఇద్దరు కుర్రవాళ్లు పదహారు పదిహేడేళ్లుండవచ్చు వాళ్ల పక్కగా పడివున్న సైకిలు. వాళ్ల చుట్టూ జనం.

"నాకొడుకులికి కిందామీద తెలుత్తలేదు ఇంత మంది జనం వుంటె కాత్త నెమ్మదిగా ఎల్తే ఏవౌద్ది. గౌర్నమెంటు బాగా మేపుతుంది. పైగా ఏమన్నా అంటె తప్పు." ఆగడబిడలోంచి ఎవరిదో పెద్దగా గొంతు వినపడుతోంది. అవేమాటల్ని అటూఇటుగా అందరూ తమతమ పద్ధతుల్లో అంటున్నారు. వాళ్లని కొట్టబోతున్న వాళ్లని ఎవరో ఆపుతున్నారు. వాళ్లిద్దరిలో కాస్త పొడుగ్గా వున్న కుర్రాడు రోషంగా చూస్తూ అంటున్నాడు. "బెల్లుకొడ్తున్నాగా" అని. అప్పటి దాకా అనేక ఆలోచనల్తో ఎవరిమీదో తెలీనికసితో వున్నవాళ్లు ఆ గొడవతో కొంత శాంతిని పొందారు. పది నిమిషాల వ్యవధిలో మొత్తం మీద ఆ కుర్రాళ్ళిద్దరూ కొట్టబడకుండానే వెళ్ళిపోనివ్వబడ్డారు.

వీధి కొద్దిగా ఖాళీ అయింది. రకరకాలుగా చర్చించు కుంటున్నారు. ఎవరిదారిన వారు బయలుదేరారు జనం గంగాధరం, భోజనానికి వచ్చిన సొసైటీప్రెసిడెంటు తో మాట్లాడుతూ లోన వుండిపోయాడు. అలసటగా అనిపించి సిగరెట్టు కాల్చుదామనిపించింది. కొద్దిదూరంలోనే రోడ్డు మీద కిళ్లీ కొట్టు వుంది. ఒంటరిగా అటునడిచాను. సిగరెట్ తీసుకుని వెలిగించాను. చినుకుల చల్ల దనానికి కొంత సెగ తగిలినట్టు అనిపించింది. అప్పుడే రోడ్డుమీద లారీ ఒకటి ఆగింది. ఎవరో యువకుడు దిగాడు. లగేజీ బానే వుంది. లగేజిని చెక్ చేసుకున్నాడు. యధాలాపంగా నావైపు చూసాడు. నామీది నుండి తొలిగిపోయిన అతనిచూపు వెంటనే నావైపు తిరిగింది. కొద్ది సెకన్లు అలాగే చూసాడు. నాకూ ఆసక్తికలిగింది, బలిష్టంగా ఉన్నాడు. చిన్నక్రాపు, పాదాలకు ఆకుపచ్చ షూస్. ఆ లగేజీ బాక్స్ ...... సందేహంలేదు. ఇతను మిలటరీలో చేస్తున్నట్టున్నాడు. చూస్తుండగానే నాదగ్గరకొచ్చి

"సార్ ! మీరు చక్రధరం గారా ? " అని అడిగాడు. "అవును" అతనెవరో నాకు గుర్తుకు రాలేదు. -

"నేను హైస్కూల్లో మీ జూనియర్ని." నాకింకా గుర్తుకు రాలేదు. "మాది మాలపల్లి సార్!" ఇంకా ఆలోచిస్తూన్నాను.

"మీరు స్టూడెంట్ లీడర్ గా వున్నప్పుడు, జండావందనం దగ్గిర 'ప్రతిజ్ఞ" చెప్పటానికి నా నెంబరు పిలిచారు. నేను వచ్చీరాక చెబుతుంటే అంతా నవ్వారు. మీరు అందుకొని పూర్తిచేసారు. లైబ్రరీలో కూర్చుని ఏడుస్తున్న నా దగ్గరకొచ్చి బాధపడాల్సిన అవసరం లేదని, ఇప్పుడు నేర్చుకొమ్మని చెప్పారు." గొంతులో ఆత్మీయత.

నాకు గుర్తొచ్చింది.అది గుర్తుపెట్టుకొని ఇతను నన్ను పలకరించడం. అప్పుడు నేను అతన్ని ఓదార్చింది బిగ్‌బ్రదర్‌యాటిట్యూడ్‌తో ఐవుండొచ్చు. "మాతాత మీ నాన్నగారు చిన్నగావున్నపుడు మీ దగ్గర పాలేరు తనం చేసాడట. మీ నాన్నగారు పోయినప్పుడు రెండురోజులూ ఏడుస్తూ వుండి పోయాడు." నాకు ఇప్పటివరకూ గుర్తులేని నా చిరకాల మిత్రుడు చెబుతున్నాడు.

ఈ లోపునే వెనుకనుండి నన్నెవరో పిలిచారు. త్వరగా రమ్మని. "వస్తానుసార్!" అని చెయ్యి చాచాడు. ను లి వెచ్చని స్పర్శ ! అతని చెయ్యి ఊపి - అడ్రసు ఇస్తాననీ ఎప్పుడైనా లెటరువ్రాయమనీ చెప్పాను. నా అడ్రసు అతనికి తెలుసునట! వెనక్కు తిరుగుతూ చెప్పాను "నన్ను సార్ అనవద్దని".

గట్టిగా చల్లగాలి వీచింది. చినుకుల శబ్దం పెరిగింది. అతను ఏదో అన్నాడు. "అలాగే చక్రధరం" అని ఐవుండొచ్చు.

*